


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 27.01.2026 | సంపుటి : 2 | సంచిక :351 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI Tuesday 27.01.2026 volume : 2 Issue : 351 Pages : 8 Cost : 2/-



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధికి

# ప్రభుత్వం కృషి



### మూడు ఎకనమిక్ జోన్లుగా రాష్ట్ర విభజన

**తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో పెరిగిన ఇమేజ్**

**మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయింపు**

**26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ**

**ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందచేత**

**గణతంత్ర దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఎగరవేశారు.పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని.. ఈ డాక్యుమెంట్ హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచుతుందని చెప్పారు. రాష్ట్రాన్ని మూడు ఎకనమిక్ జోన్లుగా విభజించి, కీలక రంగాలకు ప్రత్యేకమైన జోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయించినట్లు గవర్నర్ వెల్లడించారు.

హైదరాబాద్,జనవరి26 : రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, గతేడాది బతుకమ్మ వేడుకలు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాయని ఆయన పేర్కొన్నారు. 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రు-ణమాఫీ చేసినట్లు, ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందజేశామని గవర్నర్ తెలిపారు. ధాన్యం

-మిగతా 2 లో..



## మువ్వన్నెల

# రెపరెపలు

**జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము**

**ఆకట్టుకున్న సైనిక శకట ప్రదర్శన**

**ప్రత్యేక ఆకర్శణగా ఆపరేషన్ సిందూర్ ఆయుధ వ్యవస్థలు**

**ముఖ్య అతిథులుగా ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్‌డెర్ లేయెన్**

దేశ రాజధాని ఢిల్లీలో గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనిక దళాల కవాతు ప్రారంభమైంది. అపాచీతో పాటు ప్రచండ్ తేలికపాటి హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోరులో ధరించే దుస్తులతో అశ్వికదళం తొలిసారి ఈ పరేడ్‌లో పాల్గొంది. ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక విభాగం కూడా ప్రదర్శనలిచ్చింది. దేశ అభివృద్ధి ప్రస్థానం, సాంస్కృతిక వైవిధ్యం, సైనిక బలం, ఆపరేషన్ సిందూర్‌లో వాడిన ప్రధాన ఆయుధ వ్యవస్థలు వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

న్యూఢిల్లీ, జనవరి 26 : ఈ వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుకలను వీక్షించేందుకు వేలాది మంది

-మిగతా 2 లో..



06

75 దేశాలకు

## వీసాల బ్రేక్

అందుబాటులోకి 50వేల గ్రీన్‌కార్డులు



06

భారత నూలుకు

## డ్యూటీ-ఫ్రీ

సౌకర్యం తొలగించాలి

బంగ్లాదేశ్ వస్త్ర పరిశ్రమ



## ధృతరాష్ట్రపాత్రలో స్పీకర్

# గడ్డం ప్రసాద్ కుమార్


**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టాలి**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**పార్టీ లో చేరిన పలువురు చేవెళ్ల నేతలు**

హైదరాబాద్, జనవరి 26 : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్రపాత పోషిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహాభారతంలో ధృతరాష్ట్రుడికి ఏమీ కనిపించనట్లు.. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సభాపతి అలానే వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని రాష్ట్ర ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో చేవెళ్ల నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నేతలు.. బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా

-మిగతా 2 లో..



## కర్రెగుట్టల్లో పేలిన మందు పాతరలు

**పదిమంది భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలు**

ములుగు, జనవరి 26 : తెలంగాణ సరిహద్దులో ఉన్న కర్రెగుట్టల్లో మావోయి స్టులు అమర్చిన ఐఈడీలు పేలి 10 మంది భద్రతా సిబ్బంది గాయపడ్డారు. కర్రెగుట్టల్లో

2 లో..



## స్వాతంత్య్ర ఉద్యమ చరిత్ర లేని బీజేపీ

- ఉపాధిలో గాంధీ పేరును తొలగించారు
- ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కిన ఘనత
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొనని పెద్దలు 2014 నుంచి అధికారంలోకి వచ్చారని, వారు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మర్శించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ పేరును తొలగించాలని మన్రేగా పథకాన్ని రద్దు చేస్తున్నారని.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ చిత్రాలు కనిపిస్తాయని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు.



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹72



## మేడారంలో మావోరి తెగ సందడి

**గద్దెల ప్రాంగణంలో హాకా నృత్య ప్రదర్శన**

**కళాకారులతో కలిసి నృత్యం చేసిన మంత్రి సీతక్క**

ములుగు, జనవరి 26 : ప్రపంచ ప్రఖ్యాత శ్రీ సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా సోమవారం న్యూజిలాండ్‌కు చెందిన మావోరి తెగ ప్రతినిధులు మేడారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా

-మిగతా 2 లో..



## రాజ్యాంగాన్ని కాలరాసిన ఇందిర

**అదేబాటలో కాంగ్రెస్ పాలకులు**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

హైదరాబాద్, జనవరి 26 : రాజ్యాంగంలో కల్పించిన మౌలిక హక్కులను మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కాలరాశారని.. ఇందిరా, రాజీవ్ గాంధీల బాటలోనే రాహుల్ గాంధీ నడుస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. భారతీయులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని... ఇతర దేశాలకు

-మిగతా 2 లో..

## మాజీ ఎంపి సంతోష్‌కు సిట్ నోటీసులు

**బిఆర్ఎస్ మాజీ ఎంపి సంతోష్‌కు సిట్ నోటీసులు**



హైదరాబాద్, జనవరి 26 : సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు తాజాగా బీఆర్ఎస్ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ రావుకు నోటీసులు జారీ చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా, ఈ వ్యవహారానికి సంబంధించిన కొన్ని కీలక వాస్తవాలు సంతోష్ రావుకు తెలిసి

-మిగతా 2 లో..



# అంబరాన్నంటిన గణతంత్ర వేడుకలు





(మొదటిపేజీ తరువాయి)

విచ్చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్వహించిన పరేడ్ భారత సైనిక శక్తి పాటవాన్ని సగర్వంగా చాటిచెప్పింది. ఆపరేషన్ సిందూర్‌లో వాడిన పలు ఆయుధ వ్యవస్థలను సైనిక దళాలు కర్తవ్యపథ్ వేదికగా అచ్చెరువొందేలా ప్రదర్శించాయి. ఈ కవాతులో తొలిసారిగా బ్యాటిల్ అరే ఫార్మేషన్‌లో నిర్వహించిన కవాతు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. యుద్ధ క్షేత్రంలో సైన్యాల మోహరింపును పోలినట్టు పరేడ్ నిర్వహించడం అతిథులు ఆశ్చర్యపోయేలా చేసింది. ఈ పరేడ్‌లో త్రివిధ దళాలకు చెందిన 6,050 సైనికులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ థీమ్‌తో సాగిన ఆయుధ ప్రదర్శన భారత సైనిక పాటవాన్ని జగద్విదితం చేసింది. ఈ వేడుకల సందర్భంగా నాలుగు ఎమ్ఐ-17 హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకగా నిలిచిన ఆకాశ్ ఆయుధ వ్యవస్థ, బ్రహ్మోస్ క్షిపణి ప్రదర్శన, 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగలిగే సూర్యాస్త్ర రాకెట్ లాంఛర్ అతిథులను ఆకట్టుకున్నాయి. అర్జున్ యుద్ధ ట్యాంకు ప్రదర్శన కూడా ప్రత్యేక అట్రాక్షన్‌గా నిలిచింది. భారత్‌కు అత్యంత కీలకంగా మారిన ఎస్-400 క్షిపణి నిరోధక వ్యవస్థను కూడా ప్రదర్శించారు. అపాచీ, ప్రచండ్ హెలికాప్టర్లు, వివిధ యుద్ధ విమానాల గగనతల విన్యాసాలు మెప్పించాయి. డ్రోన్ ప్రదర్శన కూడా పరేడ్‌లో జనాలను అమితంగా ఆకట్టుకుంది. ఈ కవాతులో కొత్తగా ఏర్పడిన భైరవ్ లైట్ కమాండో బెటాలియన్ కూడా మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సైనిక కవాతుతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలు, కళా ప్రదర్శనలు దేశ సాంస్కృతిక వైవిధ్యతను చాటాయి. కేంద్ర ప్రభుత్వ విభాగాలకు చెందిన 30 శకటాలు దేశ ఖ్యాతిని ఇనుమడింపచేశాయి. ఈ వేడుకల్లో దేశం నలుమూలల నుంచి సుమారు 10 వేల మంది అతిథులు పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు.



# రాజ్యాంగాన్ని కాలరాసిన ఇందిర

(మొదటిపేజీ తరువాయి)

చెందిన వారికి ఓటు హక్కు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చాలా మంది రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేశారని... నెహ్రూ రాజ్యాంగాన్ని పక్కకు పెట్టారని విమర్శించారు. మొదటిసారి రాజ్యాంగాన్ని అవమానించింది నెహ్రూ అని... అంబేద్కర్‌ను అవమానించారని ఆరోపించారు. అంబేద్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది అంటూ విరుచుకుపడ్డారు.సీఐఆర్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. గ్రామీణ ఉపాధి పథకంలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. పేదలకు మేలు చేయాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని తెలంగాణ బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ 60 ఏళ్లపాటు దేశాన్ని దోచుకుందని.. పేదలకు మేలు చేసే పథకాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని రాష్ట్ర బీజేపీ చీఫ్ విమర్శించారు. రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. అంబేద్కర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం భారతరత్న ఇవ్వలేదని గుర్తుచేశారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని గౌరవించింది మోదీ ప్రభుత్వమని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రైతులకు ఏమీ చేయలేదని, ప్రధాని కిసాన్ యోజన ద్వారా రైతులకు మోదీ మేలు చేస్తున్నారని పేర్కొన్నారు. మజ్లిస్‌తో కలిసి కాంగ్రెస్ పని చేస్తోందని... కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు అవినీతి పార్టీలంటూ వ్యాఖ్యలు చేశారు. రెండు పార్టీలను తరిమికొట్టి బీజేపీని ఆదరించాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఎంపీ లక్ష్మణ్ సహా పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

# తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో పెరిగిన ఇమేజ్

(మొదటిపేజీ తరువాయి)

ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. భూ వివాదాలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చామని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గ్రూప్-1, 2, 3 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని, ఇప్పటివరకు 62 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన తెలిపారు. ఐటిఐలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చి, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని గవర్నర్ తెలిపారు. బ్యాంకుల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామని, మహిళలను పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసీ అదె బస్సులకు ఓనర్లుగా చేశామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం.. 27 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టిందని గవర్నర్ తెలిపారు. తెలంగాణలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో 3.35 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని, చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో కాలుష్య



నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, హిల్ట్ పాలసీతో కాలుష్య పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామని గవర్నర్ వెల్లడించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. అమెరికా పర్యటనలో ఉండటంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరుకాలేదు. సీఎం రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ ప్రజలకు సోషల్ మీడియా ద్వారా సందేశమిచ్చారు. రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదించబడిన ఈ రోజును భారతదేశ చరిత్రలో ముఖ్యమైన సందర్భంగా సీఎం అభివర్ణించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కేటీఆర్. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు న్యాయం జరగాలంటే పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నారు. రెండోసారి మోసపోతే.. మనం తప్పు చేసిన వాళ్లమవుతామని చెప్పారు. ఈసారి కేసీఆర్ సీఎం అయితే తెలంగాణలో మిగిలిన సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చేవెళ్లలో కాలె యాదయ్యను తన మనిషి అనుకుని కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ గెలిపించిన కొన్ని రోజులకే.. ఆయన కాంగ్రెస్ గూటికి వెళ్లాడంటూ మండిపడ్డారు. యాదయ్య పార్టీ మారినట్లు ఆధారాలున్నాయని.. ఆయనపై వేటు వేయాలని స్పీకర్‌ను కోరామన్నారు. కానీ యాదయ్య.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని స్పీకర్ అంటున్నారని పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, యాదయ్యలు చిన్ననాటి నుంచీ దోస్తులని.. వీరిద్దరూ ఒకే బండిపై తిరిగేవారని కేటీఆర్ చెప్పుకొచ్చారు.చేవెళ్లలో ఐదేళ్ల అబ్బాయిని అడిగినా.. కాలె యాదయ్య పార్టీ మారాడనే చెబుతారన్నారు. కానీ స్పీకర్ మాత్రం ఆయన బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని చెబుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు.. తాము పార్టీ మారామని చెప్పే దమ్ములేదని కేటీఆర్ అన్నారు.ఎన్నికల ప్రచార సమయంలో చేవెళ్లలో దళితులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చాలా హామీలు ఇచ్చారని చెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. ప్రతీ దళిత కుటుంబానికి రూ.12 లక్షలు కాదు కదా.. కనీసం 12 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. వృద్ధులకు



పింఛన్లు పెంచుతామని చెప్పి మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అందరినీ కడుపులో పెట్టుకుని చూసేవారని వివరించారు. నాట్లు వేసే సమయంలో టింగ్ టింగ్‌మంటూ రైతుల అకౌంట్‌లలో రైతుబంధు పడేదంటూ ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై నిలదీస్తుంటే.. తమపై కేసులు పెట్టి బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. బూతులు తమకూ వచ్చన్న ఆయన.. మాట్లాడేందుకు సంస్కారం అడ్డొస్తోందన్నారు. ప్రజల దయతో తామంతా మంత్రులమయ్యామని కేటీఆర్ చెప్పారు.

# కర్రెగుట్టల్లో పేలిన మందుపాతరలు

(మొదటిపేజీ తరువాయి)

మావోయిస్టుల కదలిక, ఐఈడీలు అమర్చినట్లు భద్రతా సంస్థలకు విశ్వసనీయ సమాచారం అందడంతో కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అనేక ఐఈడీలు ఒకదాని తర్వాత ఒకటి పేలాయి. దీంతో జవాన్లు గాయపడ్డారు. వారిని ఆర్మీ హెలికాప్టర్‌లో రాయ్‌పుర్‌కు తరలించారు. వీరిలో 9 మంది డీఆర్‌జీ, మరొకరు కోబ్రా బెటాలియన్‌కు చెందినవారు. గాయపడిన భద్రతా సిబ్బందికి ప్రాణాపాయం తప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కర్రెగుట్టల్లో హైఅలర్ట్ ప్రకటించి కూంబింగ్ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. గతేడాది ఇదే ప్రాంతంలో 21 రోజుల పాటు దేశంలోనే అతిపెద్ద మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ నిర్వహించిన విషయం తెలిసిందే.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో పరిణామం

(మొదటిపేజీ తరువాయి)

ఉండవచ్చని భావిస్తున్నట్లు పోలీసులు నోటీసులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, విచారణ నిమిత్తం జనవరి 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జుబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో స్వయంగా హాజరు కావాలని జుబ్లీహిల్స్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. వెంకటగిరి ఆదేశించారు. ఇప్పటికే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులను విచారించిన సంగతి తెలిసిందే. ఐటీ చట్టం, ప్రభుత్వ ఆస్తుల నష్టం నిరోధక చట్టం వంటి కఠిన సెక్షన్ల కింద కొనసాగుతున్న ఈ విచారణలో సంతోష్ రావుకు నోటీసులు అందడం రాజకీయ వర్గాల్లో పెను కలకలం రేపుతోంది. రేపు మధ్యాహ్నం జరగబోయే ఈ విచారణలో సిట్ అధికారులు సంతోష్ రావు నుండి ఎటువంటి సమాచారాన్ని రాబడతారనే అంశంపై ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

# మేడారాన్ని సందర్శించిన మావోరి తెగ ప్రతినిధులు



(మొదటిపేజీ తరువాయి)

మేడారం గద్దెల ప్రాంగణంలో మావోరి తెగ వారి సంప్రదాయ నృత్యమైన 'హాకా' నృత్యాన్ని వారు ప్రదర్శించారు. హాకా నృత్యం అనేది మావోరి తెగలో యుద్ధానికి సిద్ధమయ్యే సమయంలో తమ సైనికుల్లో ఉత్సాహం నింపేందుకు, శత్రువుల్లో భయాన్ని కలిగించే విధంగా చేసే సంప్రదాయ నృత్యంగా ప్రసిద్ధి చెందింది. ఈ నృత్యంలో ముఖభావాలు, శరీర చలనలు అత్యంత ప్రభావవంతంగా ఉంటాయి. తెలంగాణ?న్యూజిలాండ్ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మావోరి తెగ ప్రతినిధులు మేడారం మహాజాతరను సందర్శించారు. హాకా నృత్య ప్రదర్శన సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా కళాకారులతో కలిసి నృత్యం చేసి వారి ఉత్సాహాన్ని పెంచారు. సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీ సంస్కృతికి దేశ సరిహద్దులు, భాషలు అడ్డుకావని, ప్రపంచంలోని ఎక్కడైనా ఆదివాసీలు అడవి, ప్రకృతి మీదే ఆధారపడి జీవనం సాగిస్తారని అన్నారు. ఆదివాసీ జీవన విధానం, విశ్వాసాలు ప్రపంచవ్యాప్తంగా ఒకే తత్వాన్ని ప్రతిబింబిస్తాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం మావోరి తెగ ప్రతినిధులను గద్దల వద్దకు తీసుకెళ్లి వన దేవతల దర్శనం చేయించారు. సమ్మక్క?సారలమ్మ వన దేవతల వైభవం, చరిత్రను మంత్రి సీతక్క స్వయంగా వారికి వివరించారు. ఈ సందర్భంగా బంగారం, వన దేవతల ప్రసాదాన్ని అందజేసి మావోరి తెగ ప్రతినిధులను సన్మానించారు.



# బాలిక ప్రాణం తీసిన చైనా మాంజా

**హైదరాబాద్ :** కూకట్‌పల్లిలో దారుణం జరిగింది. ప్రమాదవశాత్తు చైనా మాంజా మెడకు చుట్టుకొని గాయాలు కావడంతో ఓ బాలిక మృతి చెందింది. తండ్రితో బైక్‌పై వెళుతున్న ఓ బాలికకు చైనా మాంజా మెడకు చుట్టుకొని తీవ్రగాయాలయ్యాయి. దీంతో బాలికకు తీవ్ర రక్తస్రావం అయ్యింది. దీంతో ఆ బాలిక తండ్రి హుటాహుటీన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఇటీవల జరిగిన బొటానికల్ గార్డెన్ వద్ద ఇద్దరు యువకులు బైక్‌పై వెళుతుండగా చైనా మాంజా తగిలి యువకులకు తీవ్రగాయాలయ్యాయి. అంతేకాకుండా ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగరాజు అనే వ్యక్తికి సైతం మంజా తగిలి గొంతు కోసుకుపోయి తీవ్ర రక్తస్రావమయ్యింది. కర్ణాటకలో ఓ వ్యక్తి చైనా మాంజా ప్రమాదంలో మృతి చెందారు.



# నేడు మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్!

**హైదరాబాద్:** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. షెడ్యూల్ విడుదలకు ముందు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కీలక భేటీ నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు డీజీపీ కూడా పాల్గొంటారు. ఈ సమావేశం అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జిల్లా కలెక్టర్లతోనూ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారని సమాచారం. ఈ సమావేశాల అనంతరం ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యే అవకాశం ఉంది. వచ్చే నెల 11 లేదా 12వ తేదీన పోలింగ్ నిర్వహించి 15వ తేదీలోపు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను ముగించేలా షెడ్యూల్ ఉంటుందని సమాచారం. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్న విషయం తెలిసిందే.

# మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

## హుస్నాబాద్‌లో జెండా ఊపి ప్రారంభించిన మంత్రి పొన్నాం







**సిద్దిపేట, జనవరి 26 :** తెలంగాణ కుంభమేళాగా పిలవబడే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్ స్టేషన్‌లో మేడారం స్పెషల్ బస్సులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం తీసుకుంటున్న పలు కీలక నిర్ణయాలను ఆయన వెల్లడించారు. జాతరకు వెళ్లే భక్తులకు ఎక్కడా రవాణా ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4000 ఆర్టీసీ బస్సులను కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఒక్క హుస్నాబాద్ డిపో నుండే మేడారానికి 50 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని, ఎవరూ ఇబ్బంది పడకుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని మంత్రి సూచించారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం అత్యంత సురక్షితమైనదని, ప్రైవేట్ వాహనాల కంటే ఆర్టీసీ బస్సులకు ఒక ప్రత్యేక సౌకర్యం ఉందని మంత్రి వివరించారు. భక్తులు నడక సాగించే అవసరం లేకుండా, నేరుగా అమ్మవార్ల గద్దెల వరకు వెళ్లగలిగే రవాణా సౌకర్యం కేవలం ప్రభుత్వ బస్సులకే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేట్ వాహనాలలో రద్దీ , ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు ప్రజలు ఆర్టీసీని ఎంచుకోవాలని కోరారు. జాతరలో లక్షలాది మంది భక్తులు పాల్గొనే క్రమంలో చిన్న పిల్లలు తప్పిపోయే ప్రమాదం ఉంటుంది. దీనిని నివారించేందుకు పోలీస్ శాఖ , ఆర్టీసీ సంయుక్తంగా ఒక వినూత్న చర్య చేపట్టాయి. జాతరకు వచ్చే ప్రతి చిన్న బిడ్డ చేతికి పేరు , తల్లిదండ్రుల ఫోన్ నంబర్ నమోదు చేసిన ఒక ప్రత్యేక బ్యాండ్‌ను కడతారు. ఒకవేళ రద్దీలో పిల్లలు తప్పిపోయినా, ఈ బ్యాండ్ ఆధారంగా వారిని వెంటనే తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి వీలవుతుంది. ఈ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు. హుస్నాబాద్ నుండి ప్రారంభమైన ఈ బస్సు సర్వీసులు జాతర ముగిసే వరకు నిరంతరాయంగా అందుబాటులో ఉంటాయని, పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు.



## లోక్‌భవన్‌లో గవర్నర్ ఎట్ హోం

### హాజరైన మంత్రులు, ప్రముఖులు

**హైదరాబాద్, జనవరి 26 :** రిపబ్లిక్ డే సందర్భంగా లోక్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమం జరిగింది. నేతలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీజే ఏకే సింగ్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, భాజపా నేతలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్స్‌లెన్స్‌ను జిష్ణుదేవ్ వర్మ ప్రదానం చేశారు. ఎట్ హోం సందర్భంగా రాజ్‌భన్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.



## స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర లేని బీజేపీ

- ఉపాధిలో గాంధీ పేరును తొలగించారు
- ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కిన ఘనత
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, జనవరి 26 :** స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనని పెద్దలు 2014 నుంచి అధికారంలోకి వచ్చారని, వారు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మర్శించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ పేరును తొలగించాలని మన్రేగా పథకాన్ని రద్దు చేస్తున్నారని.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ చిత్రాలు కనిపిస్తాయని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. 2014 వరకు యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నారని, లౌకికవాదానికి తూట్లు పొడుస్తున్నారని, కులాలు- మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని మహేష్ గౌడ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఆర్థిక విధ్వంసం జరిగిందని... సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కుల సర్వేతో యావత్ రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని తెలిపారు. బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కులగణన బిల్లులను బీజేపీ అడ్డుకుంటోందని, బీజేపీ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని టీపీసీసీ చీఫ్ కోరారు. మహాత్ముడి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య పోరాటం విజయవంతమైందని, ప్రపంచం గర్వించదగ్గ రాజ్యాంగాన్ని అంబేద్కర్ రాశారన్నారు. మహాత్మా గాంధీ కలలు నెరవేర్చే దూరదృష్టి ఉన్న వ్యక్తి నెహ్రూ అని ప్రశంసించారు. ఐరన్ లేడీ ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ దేశానికి గట్టి పునాదులు వేశారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డాక్టర్ అజారుద్దీన్, షబ్బీర్ అలీ సహా వీహెచ్, దానం నాగేందర్, సంపత్, కోదండరాం, బెల్లయ్య నాయక్, చిన్నారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిజామాబాద్ దాడి ఘటన దారుణం

- ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను పరామర్శించిన దామోదర
- దాడికి కారకులను వదిలిపెట్టేది లేదన్న మంత్రి

**హైదరాబాద్, జనవరి 26 :** నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లర్ల దాడిలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం పరామర్శించారు. సౌమ్యపై దాడి దురదృష్టకరమని మంత్రి విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎక్సైజ్, పోలీస్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు మంత్రి. క్రమంలోనే నిజామాబాద్‌లో జరిగిన ఘటన అత్యంత దురదృష్టకరమని రాజనర్సింహ అన్నారు. ఇందులు కారకులైన ప్రతి ఒక్కరినీ చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. సౌమ్య ఆరోగ్య పరిస్థితి నిన్నటి కంటే మెరుగైనప్పటికీ.. ఇంకా ఆమె కండీషన్ క్రిటికల్‌గానే ఉందని తెలిపారు. నిమ్స్‌లో సుశిక్షితులైన సీనియర్ వైద్యుల బృందం, సౌమ్యకు అత్యాధునిక వసతులతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. సౌమ్య సంపూర్ణంగా కోలుకుటుందని ఆశిస్తున్నామన్నారు. ఆమె కుటుంబాన్ని అన్నిరకాలుగా ఆదుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు. విధి నిర్వాహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. నిందితులపై ఇప్పటికే హత్యాయత్నం కేసు నమోదు చేయించామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. నిమ్స్‌లో సౌమ్యను పరామర్శించిన మంత్రికి ఆమె ఆరోగ్య పరిస్థితిని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, వైద్యులు వివరించారు.

## దేశ భద్రతకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి

- సురక్షిత నగరంగా నిలబెట్టడానికి పోలీసు శాఖ కృషి
- గణతంత్ర వేడుకల్లో నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్




**హైదరాబాద్, జనవరి 26 :** దేశ భద్రత కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను దేశంలోనే కాదు.. అంతర్జాతీయ స్థాయిలో సురక్షిత నగరంగా నిలబెట్టడానికి పోలీసు శాఖ కృషి చేస్తోందని సీపీ సజ్జనార్ తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో భాగంగా పేట్లబురుజులోని కార్ హెడ్‌క్వార్టర్స్‌లో జాతీయ జెండాను ఎగురవేసిన సీపీ.. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేడు అత్యంత పవిత్రమైనదని, స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. దేశ భద్రత కోసం వేలాది మంది పోలీసులు తమ ప్రాణాలను అర్పించారని పేర్కొన్నారు. ఇందుకోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని, ప్రజల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని వివరించారు. పోలీసింగ్‌లో మానవీయ దృక్పథం ఉందన్న ఆయన.. విక్టిమ్, సిటిజన్ సెంట్రిక్ అప్రోచ్‌తో బాధితులకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా బాధితుల ఇంటి వద్దే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసే వ్యవస్థను దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అమలు చేశామని గర్వంగా పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల కేసుల్లో తక్షణ చర్యలు, 24/7 స్పందన ఉంటుందని తెలిపారు. యాప్ ద్వారా ప్రజల భద్రతను మరింత బలోపేతం చేస్తున్నామని సజ్జనార్ వివరించారు. కేసులు నమోదు చేయడమే కాదు.. బాధితులకు న్యాయం అందేవరకూ పోలీసులదే బాధ్యత అని స్పష్టం చేశారు. నేరాల నివారణెళి లక్ష్యంగా విధానాన్ని అనుసరిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ ద్వారా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీపీ తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి చేశామని.. ప్రాణ రక్షణెళి ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు సీపీ. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జీరో టాలరెన్స్ దిశగా కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా, వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల విశ్వాసమే పోలీసింగ్‌కు బలమని, శాంతి భద్రతల పరిరక్షణలో టెక్నాలజీ వినియోగాన్ని పెంచామని చెప్పారు. ప్రజల సహకారంతోనే సురక్షిత సమాజం సాధ్యమని ఆయన అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ విలువల పట్ల అందరూ నిబద్ధత చూపాలని తెలిపారు. చట్టం అందరికీ సమానమని, న్యాయం అందరి హక్కు అని సజ్జనార్ స్పష్టం చేశారు.

## పద్మ అవార్డు ఘనత మీదే

### నటకిరీటి రాజేంద్రప్రసాద్ వెల్లడి



**హైదరాబాద్, జనవరి 26 :** 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రభుత్వం పద్మ అవార్డు గ్రహీతల పేర్లు విడుదల చేయగా నటకిరీటి రాజేంద్రప్రసాద్ కి పద్మ శ్రీ లభించింది. తనకు పద్మశ్రీ అవార్డు రావడంతో రాజేంద్రప్రసాద్ స్పందించారు. నా ప్రాణానికి ప్రాణమైన తెలుగు ప్రేక్షక దేవుళ్ళందరికీ నమస్కారం. ఈ రోజు నా జీవితంలో ఎంతో సంతోషకరమైన రోజు. భారత ప్రభుత్వం నాకు పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది అని తెలిసినప్పటినుండి నా కళ్ళు ఆనందంతో నిండిపోయాయి. ఒక నటుడిని గుర్తించి ఇంతటి గొప్ప గౌరవాన్ని అందించిన భారత ప్రభుత్వానికి నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. అలాగే నా పేరుని ఈ పురస్కారానికి సిఫార్సు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, పెద్దలందరికీ నా ప్రత్యేక కృతజ్ఞతలు అని అన్నారు. కానీ నిజం చెప్పాలంటే అవార్డు నాది కాదు, మీది. 48 ఏళ్లుగా నన్ను ఒక నటుడిగానే కాకుండా, మీ ఇంట్లో ఒక మనిషిగా, మీలో ఒకటిగా గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారు. నేను నవ్వించిన, ఏడిపించిన, మా రాజేంద్రప్రసాద్ అని మీరు చూపించిన ఆప్యాయత నాకు దక్కిన నిజమైన అదృష్టం. ఆ ప్రేమే ఈరోజు నన్ను ఇక్కడ వరకు నడిపించింది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు నన్ను సొంత బిడ్డ లాగా ఆదరించారు. మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేను. నాతోపాటు ఈ ఏడాది పద్మ పురస్కారాలను అందుకుంటున్న దేశంలోని మహానుభావులు అందరికీ నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మీ ఆశీస్సులు ఎప్పుడూ నామీద ఇలాగే ఉండాలి. బ్రతికున్నంత వరకు సర్వదా, మీ రాజేంద్రప్రసాద్.' అని పేర్కొన్నారు.

## గణతంత్ర వేడుకల్లో విషాదం

### గుండెపోటుతో ఎస్ఐ మృతి

**ముంబై, జనవరి 26 :** మహారాష్ట్రలోని ధరాశివ్ జిల్లాలో రిపబ్లిక్ వేడుకల సందర్భంగా సోమవారంనాడు విషాద ఘటన చోటుచేసుకుంది. జెండా ఆవిష్కరణ జరుగుతుండగా విధి నిర్వహణలో ఉన్న పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్ జాదవ్ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన సిబ్బంది ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా కన్నుమూశారు. ఈ ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాం÷-రతికి గురిచేసింది. ధరాశివ్ జిల్లా ఉమర్గా టౌన్‌లో గణతంత్ర వేడుకలు జరుగుతుండగా మోహన్ జాదవ్ గుండెపోటుతో కన్నుమూసినట్టు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపింది. జాతీయపతాకానికి అధికారులు, సిబ్బందితో కలిసి వందనం చేస్తుండగా అకస్మాత్తుగా ఆయన గుండెపోటుతో వెనక్కి పడిపోయారని, దీంతో తలకు తీవ్రగాయమైందని తెలిపింది. వెంటనే సిబ్బంది ఆయనను ఉమర్గాలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని పేర్కొంది. గుండెపోటుతో ఆయన మరణించినట్టు ప్రాథమిక సమాచారంలో వెల్లడైంది.

## అక్రిడిటేషన్ జీవో సవరణ

### సవరణ జీవో నెంబర్ 103 జారీ

**హైదరాబాద్, జనవరి 26 :** ప్రభుత్వం జారీచేసిన అక్రిడిటేషన్ల జీవోపై జర్నలిస్టుల నుంచి ఆందోళన వ్యక్తం కావడంతో ప్రభుత్వం దిద్దుబాటుకు పూనుకుంది. డెస్క్ జర్నలిస్టులకు సైతం అక్రిడిటేషన్ కార్డులే జారీ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణ జీవో నెంబర్ 103 పై తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం హర్షం వ్యక్తం చేసింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ మాట్లాడుతూ గతంలో తీసుకువచ్చిన 252 జీవో పై టీయూడబ్ల్యూజే చేసిన పోరాట ఫలితంగా జర్నలిస్టు సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసిందన్నారు. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవరణ జీవో తేవడం, అందులో ప్రధానంగా అందరి జర్నలిస్టుల మాదిరిగానే డెస్క్ జర్నలిస్ట్ సైతం అక్రిడిటేషన్ కార్డులే జారీచేస్తామని చేస్తున్నారని స్పష్టం చేయడం ముదావహం అన్నారు. మండల స్థాయిలో లక్షన్నరకు పైగా జనాభా ఉన్నచోట అదనపు కార్డులు ఇస్తామని పేర్కొనడంతోపాటు కల్చరల్, స్పోర్ట్స్, సినిమా జర్నలిస్టులకు సైతం ప్రత్యేకంగా కార్డులు జారీ చేస్తానని ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జీవో మారడం టీయూడబ్ల్యూజే సాధించిన విజయమని పేర్కొన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో వచ్చిన 239 జీవో ప్రకారం వచ్చినన్ని అక్రిడేషన్ కార్డులు ఈ సవరణ జీవో అనంతరం కూడా ఆ స్థాయిలో రావడంలేదని విషయం తేటతెల్లమైందన్నారు.



## గణతంత్ర దినోత్సవం రోజున స్పీకర్‌పై విమర్శలా

### కెటిఆర్ క్షమాపణలు చెప్పాలి : అద్దంకి

**హైదరాబాద్, జనవరి 26 :** గణతంత్ర దినోత్సవం రోజున రాజ్యాంగాన్ని, రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్న స్పీకర్‌ను అవమానించినందుకు కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అద్దంకి దయాకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'సభాపతిని ధృతరాష్ట్రుడితో పోల్చడం ఏమిటి? సభ్యుడిగా మీకు సంస్కారముందా? ముఖ్యమంత్రిని అవమానించడం మీది ఏ రాజనీతి? మీ నాయన కేసీఆర్ రాజ్యాంగంతో తెలంగాణ వచ్చిందని చెబుతూ అవమానిస్తున్నారు. రాజ్యాంగ వ్యతిరేకులుగా మారి, రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నట్లు నాటకాలు వేస్తున్నారు, నాటకాలు ఆడిస్తున్నారు' అని ఎమ్మెల్సీ విమర్శించారు. 'మీరు, పది మంది గురించి మాట్లాడుతున్నారు.. కానీ 39 మందిని మీ పార్టీలో చేర్చుకున్న మిమ్మల్ని ఏమనాలి? మీరు చేసిన రాజ్యాంగ ద్రోహాన్ని ప్రజలు మననం చేసుకుంటున్నారు. ఫస్ట్రేషన్‌తో చేస్తున్న మీ నాటకాలను ప్రజలు తిరస్కరించారు. మీరు ప్రతిపక్ష నాయకులుగా ఉండటం దురదృష్టకరం. ఇప్పటికైనా మీరు చేసిన తప్పును గమనించి క్షమాపణ చెబితే మంచిది' అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జూబ్లీహిల్స్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

### జూబ్లీహిల్స్‌లో సర్యటించిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జనవరి 26 :** నగరంలోని జూబ్లీహిల్స్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఈ నియోజకవర్గం నుంచి చదువుకున్న యువకుడిని నిలబెట్టి ప్రజలే గెలిపించారని పేర్కొన్నారు. రాజకీయాలు వ్యవస్థలో చాలా ముఖ్యమైనవని, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అన్ని రోడ్డు పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం జూబ్లీహిల్స్‌లో పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు ప్రజలకు సేవ చేయాలనే తపన ఉందని, అలాంటి నాయకుడితో కలిసి అభివృద్ధి పనులు చేయించుకోవాలని ప్రజలకు మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. భవిష్యత్తులో నవీన్ యాదవ్ పెద్ద స్థాయి నాయకుడిగా ఎదుగుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ అంటే చాలా అభివృద్ధి చెందిన ప్రాంతమని అనుకున్నప్పటికీ, ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. హైదరాబాద్ నగరంలో కాలుష్యం తీవ్రంగా పెరిగిందని, పరిశ్రమలను నగరానికి దూరంగా ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని వెల్లడించారు. అలాగే కమలాపురి కాలనీలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## సేవాగుణం ఉంటేనే రాజకీయాల్లోకి రావాలి

### బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

**నిజామాబాద్, జనవరి 26 :** ప్రజలకు సేవ చేసే ఆలోచన ఉంటేనే రాజకీయాల్లోకి రావాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. రాజకీయాలంటే ఏదో అనుకుని ఆలామంది భ్రపడతారని అన్నారు. ప్రజలకు సేవచేయడం, ప్రధాన లక్ష్యం కావాలన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని 12వ వార్డు బేతాళ స్వామి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగిన నియోజకవర్గాల్లో బాన్సువాడ ఒకటన్నారు. పట్టణాభివృద్ధికి రూ.600 కోట్లు వెచ్చించామన్నారు. విద్య, వైద్యం సాగు, తాగునీటిలో ముందున్నామని పేర్కొన్నారు. తన కుటుంబంలో ఉన్న సౌకర్యాలు పేద ప్రజల ఇళ్లలో ఉండాలనే ఆలోచించనతోనే రెండు పడక గదుల నిర్మాణాలు చేపట్టామన్నారు. రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ బాలరాజ్, తనది ఒకే ఆశయమని, ప్రజలకు మరింత సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

# విచారణలో కాలయాపనలు?



**ప్రభుత్వాలు నడుపుతున్న వ్యక్తులకు , పార్టీలకు జవాబుదారీతనం లేకుండా పోయింది. సవాళ్లు, ప్రతిసవాళ్ల తో సమస్యలను పక్కదారి పట్టించేస్తున్నారు. ప్రధానంగా ఇది తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. సమస్యలను, అవినీతిపై పరస్పర విమర్శలు చేసుకుంటూ ఇది వారి వ్యక్తిగత వ్యవహారంగా ప్రచారం చేసుకునే రీతిలో ప్రవర్తిస్తున్నారు. ఎపిలో టిడిపి, వైసిపి, తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పరిస్థితి ఇలాగే ఉంది. పరస్పర విమర్శలతో ప్రజలను మభ్య పెటట్టం ద్వారా ఈ పార్టీలు పబ్బం గడుపుకునే పరిస్థితి దాపురించింది. నిజానికి ఈ వ్యవహారంపై అంటే అవినీతి ఆరోపణలపై కేంద్రం ప్రేక్షకపాత్ర వహిస్తోంది. బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై రెండేళ్లు దాటినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. విచారణల తోనే కాలం గడిచింది.**

కేంద్ర ప్రభుత్వ టెలిగ్రాఫిక్ చట్టం ప్రకారం ఫోన్ ట్యాపింగ్ తీవ్ర నేరంగా పరిగణించాలి. బిఆర్ఎస్ పాలనా కాలంలో చాలా మంది ఫోన్ సంభాషణలను రికార్డు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వ్యక్తిగత గోప్యతను హరించివేశారు. వాటి ఆధారాలను తుడిచిపెట్టారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు తాము కూడా బాధితులమే అని చెప్పుకొంటున్నారంటే ఏ స్థాయిలో టెలిఫోన్ ట్యాపింగ్ దుర్వినియోగమయిందో అర్థం చేసుకోవచ్చు. ఇందుకు కవిత పదేపదే ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుత దర్యాప్తుతో సత్వర న్యాయం కాదుకదా, అసలు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని అంటున్నారు. ప్రతిపక్షాలతోపాటు జర్నలిస్టులు, ఇతర ప్రముఖుల సంభాషణలు విని వారి కదలికలను తెలుసుకోవడం ద్వారా కేసీఆర్ వారిని కట్టడికి యత్నించారు. అధికారాన్ని కూడా నిలుపుకోవడానికి ఈ నీచయత్నానికి పాల్పడ్డారు. ఎలక్టోరల్ బాండ్స్ పొందడం కోసం టెలిఫోన్ ట్యాపింగ్‌ను సాధనంగా వాడుకున్నట్లు బయటపడింది. కెటిఆర్ విచారణలో ఇదే ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. ఈ వ్యవహారంపై రెండేళ్లుగా విచారణ జరుగుతోంది. ఇంకెంత కాలం విచారణ జరుపుతారన్నది తెలియదు. సుప్రీంకోర్టు కూడా ఇటీవల ఒక సందర్భంలో ఇంకెంతకాలం అన్న విసయాన్ని ప్రస్తావించింది. టెలిఫోన్ ట్యాపింగ్‌పై అవసరమైన ఆధారాలు ఇప్పటికే ప్రభుత్వానికి లభించాయి. కావాలనుకుంటే ఇప్పటికిప్పుడు చర్యలు తీసుకోవచ్చు. అయినా విచారణను సాగదీస్తున్నారు. బహుశా కేసీఆర్, సంతోష్‌రావును కూడా త్వరలో విచారణకు పిలవవచ్చని అంటున్నారు. విచారణ ఎంత ఎక్కువ కాలం సాగితేస్తే అంతగా లబ్ది పొందాలని ప్రభుత్వం చూస్తున్నదా అన్నది కూడా తెలియాల్సి ఉంది. ఇదే అదనుగా ట్యాపింగ్ విచారణకు హాజరైన హరీశ్‌రావు, కేటీఆర్‌లు ప్రభుత్వంపై ఎదురుదాడి మొదలెట్టారు. వేధింపుల కోసం, ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఈ విచారణలను కనసాగిస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే వీలైనంత త్వరగా ముగించడం, దోషలును శిక్షలకు గురి చేయడం అవసరం.

గతంలో జరిగిన తప్పులపై చర్యలు తీసుకొనే విధంగా విచారణ సాగాలి. త్వరగా ముగించాలి. అలాకాకపోతే ఇదంతా అధికార విపక్షాల మధ్య నడిచే డ్రామాగా పరిగణించాల్సి ఉంటుంది. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికే విమర్శలు చేయడం మొదలెట్టారు. అతీగతీ లేకుండా విచారణలు సాగుతూ ముఖ్య నాయకులను విచారణల పేరిట పిలుస్తూ పోవడంవల్ల ప్రజలు సహజంగానే వారి విమర్శలను విశ్వసిస్తారు. టెలిఫోన్ ట్యాపింగ్ విచారణ సాగినంత కాలం బీఆర్ఎస్ నాయకులు సింగరేణి వంటి విషయాల్లో ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూనే ఉంటారు. ప్రస్తుతానికి టెలిఫోన్ ట్యాపింగ్ విషయమే హాట్ టాపిక్ అయింది. త్వరలో మరో వివాదం తెరపైకి రావొచ్చు. అప్పుడు ఇది కూడా తెర మరుగవుతుంది. ప్రభుత్వాలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి ఎంతో సమయం పట్టదు. అది సింగరేణి విషయమైనా, టెలిఫోన్ ట్యాపింగ్ విషయమైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. ప్రభుత్వాలు బలంగా కోరుకున్న సందర్భాలలో విచారణలు వేగంగా పూర్తవుతాయి. శిక్షలు కూడా అంతే వేగంగా పడతాయి. రాజకీయ క్రీడలో భాగమైనప్పుడు మాత్రమే విచారణలు సాగుతూనే ఉంటాయి. ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతూనే ఉంటాయి. ఎదురుదాడి వ్యూహాలు పదునెక్కుతాయి. ఇక సింగరేణిపై అటు కేంద్రం.. ఇటు రాష్ట్ర ప్రభుత్వం విషం చిమ్ముతున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని నిబంధనలు పెడుతూ ఆ సంస్థను నిర్వీర్యం చేయడంతో పాటు ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే రెండు బొగ్గు గనులను కేంద్రం వేలం ద్వారా అమ్మి ప్రైవేట్‌కు ద్వారాలు తెరువగా.. ఇప్పుడు రేవంత్ సర్కార్ కూడా అదేబాటలో నడుస్తున్నది. ఓవర్ బర్డెన్ పనులకు 'సైట్ విజిట్' నిబంధనను ముందుగా తెచ్చి, ఆ తర్వాత నైని బొగ్గు బ్లాక్‌లో ఏకంగా బొగ్గు ఉత్పత్తి ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు భట్టి తదితరులు రంగంలోకి దిగారని అంటున్నారు. సింగరేణి చేతిలో ఉండాల్సిన ఈ గనిని 25 ఏండ్ల పాటు ప్రైవేట్ కంపెనీల చేతుల్లో పెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. అంటే పేరు మాత్రమే సింగరేణిది, గనిపై పూర్తి అధికారాలు ప్రైవేట్ సంస్థకే ఉంటాయని అర్థం చేసుకోవాలి.

ఇలా స్వరాష్ట్రంలో సిరులు కురిపించిన సింగరేణి.. కేంద్ర, రాష్ట్ర పాలకుల నిర్ణయాలతో తన అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉన్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇటీవల చేర్చిన నిబంధనలు, పరిణామాలను నిశితంగా గమనిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం కనిపిస్తున్నది. సంస్థలో ఇప్పటివరకు ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గుపై కప్పబడి ఉండే ఓబీ పనులు మాత్రమే ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్నారు. అయితే కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఇక నుంచి ఓబీతో పాటు బొగ్గు వెలికితీత పనులు ప్రైవేట్ వ్యక్తుల చేతికి వెళ్లనున్నాయి. సింగరేణికి ఎంతో ప్రతిష్టాత్మకమైన ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్‌లో కొత్తగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎండీవో పేరిట టెండర్లను పిలువడంతో ఇక నుంచి ఈ బ్లాక్‌లో అన్ని పనులు ప్రైవేట్ వ్యక్తులే చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందువల్ల విచారణలో పారదర్శకత ఉండాలి. ట్యాపింగ్ కావచ్చు. సింగరేణి కావచ్చు నిజాలు చెప్పనప్పుడే ప్రజల్లో నిలబడతారు. లేకుంటే కనుమురుగ అవుతారు. పాలకులు విచారణల పేరుతో కాలయాపన చేయకుండా నిజాలు నిగ్గుతేల్చాల్సి ఉంది.

## ఎన్నికల పక్రియలో పెరిగిన
# మహిళల భాగస్వామ్యం

- ఎన్నికల హామీలు అమలుకు నిలదీస్తున్న మహిళలు
- ఐద్వా సమావేశంలో ప్రొఫెసర్ శాంతాసిన్హా



**హైదరాబాద్, జనవరి 26 :** దేశవ్యాప్తంగా ఎన్నికల పక్రియలో మహిళల భాగస్వామ్యం పెరుగు తున్నదని, పోలింగ్ కేంద్రాల్లో వారి ఓటింగ్ శాతమే అధికంగా ఉంటోందని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, ఐద్వా రిసెప్షన్ కమిటీ చైర్పర్సన్ ప్రొఫెసర్ శాంతాసిన్హా తెలిపారు. ఎన్నికల హామీలు అమలు చేయకుంటే ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నది కూడా మహిళలేనని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా మహిళల్లో పెరుగుతున్న రాజకీయ చైతన్యానికి ఇది నిదర్శనమన్నారు. ఐద్వా 14వ అఖిల భారత మహాసభలో ఆమె స్వాగతోపన్యాసం చేశారు. మహిళా చైతన్యం మరింత విస్తరించాల్సి ఉందని, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలమని పేర్కొన్నారు. రాష్ట్రంలో మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి, మంత్రాల రాములమ్మ, సుగుణమ్మ, చాకలి ఐలమ్మ వంటి మహిళల పోరాట స్ఫూర్తి కొనసాగుతూనే ఉందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దళిత మహిళలు పురుషులతో కలిసి పోరాడారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా వారు తమ ఇళ్లలోనే హింస, నిర్బంధాలను ఎదు ర్కొన్నారని తెలిపారు. ఈ ప్రతిఘటనే మహిళా వర్గపోరాట ఉద్యమాన్ని నిర్మించిందన్నారు. దేశవ్యాప్తంగా అనేకమంది మహిళ లు మిల్లులు, పొలాలు, అసంఘటిత రంగాల్లో అణచివేతకు గురవుతున్నారని, వారికి అండగా ఐద్వా నిలుస్తోందని తెలిపారు. కోయంబత్తూరులోని మహిళా మిల్లు కార్మికులు పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా దృఢంగా నిలిచారని, కోల్కత్తాలో జ్యూట్ కార్మికులు సామూహిక తొలగింపులను ప్రతిఘటించారని, ముంబైలోని ధన్రాజ్ కాటన్ మిల్లులోని మహిళా కార్మికులు లేఆఫ్ కు వ్యతిరేకంగా పోరాడాలని, లారీఛార్జి నుంచి కూడా ఎదుర్కొ న్నారని వివరించారు. పోరాటాలన్నీ మహిళాశక్తికి స్ఫూర్తివంతమై వన్నారు. 2024 లోక్సభ ఎన్నికల్లో 19 రాష్ట్రాల్లో మహిళా ఓటర్లు పురుషుల కంటే ఎక్కువగా ఉన్నారని. వారే నిర్ణయాత్మక శక్తిగా మారుతున్నారని శాంతా సిన్హా పేర్కొన్నారు. ఈ ప్రమాదాన్ని గమ నించే ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో మహిళల ఓట్లను తొలగించే చర్యలకు పాల్పడుతున్నారని వివరించారు. రాజ్యాంగం ప్రకారం లింగభేదం లేకుండా చట్టం ముందు అందరూ సమానమేనని, కానీ ఉపాధిలో, సమాన పనికి సమాన వేతనంలో భేదాలున్నాయ ని తెలిపారు. మహిళలకు ప్రసూతి ఉపశమనం, రాజకీయ ప్రాతినిధ్యం, గౌరవం వంటివి అవిశ్రాంత పోరాట ఫలితంగా వచ్చాయని గుర్తు చేశారు. మహిళల పోరాటాల ఫలితంగానే వరకట్నం, గృహహింస, లైంగిక హింసకు వ్యతిరేకంగా చట్టాలు సాధించుకోగలిగామన్నారు. మహిళా సాధికారతలో ప్రధానంగా పనిచేసే హక్కు, విద్యా హక్కు, ఆరోగ్య హక్కు విషయంలో అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయని వివరించారు. కులం, లింగం, తరగతి వంటి విభజన ద్వారా అత్యంత అవమానకరమైన, ఆసురక్షిత పనులకు మహిళలను పరిమితం చేస్తున్నారని, దీన్ని వ్యతిరేకించాలని కోరారు. దేశవ్యాప్తంగా అశా వర్కర్లు, అంగన్వాడీలు చేస్తోన్న పోరాటాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. అనేక రాష్ట్రాల్లో 8వ తరగతి తర్వాత పెద్ద సంఖ్యలో బాలి కలు చదువు మానేస్తున్నారని, ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలు లేకపోవడం, రక్షణలేదని ప్రయాణం వంటి కారణాలు శ్రామిక తరగతి కుటుంబాలకు విద్యను దూరం చేస్తున్నాయని, ఫలితంగా బాల్య వివాహాలు పెరుగుతున్నాయని వివరించారు. దళిత, ఆది వాసీ బాలికలు ఈ ముప్పును తీవ్రంగా ఎదుర్కొంటున్నారన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ బాధ్యతలు ప్రభుత్వాలవేనని స్పష్టం చేశారు. దీనికోసం పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు, పని స్థలం నుంచి వీధి వరకు సమిష్టి పోరాటాలకు 'ఐద్వా' మహాసభ రూపకల్పన చేయాలని అభిలాషించారు. ఐద్వా అఖిల భారత మహాసభలో పలువురు సౌహార్ద సందేశాలు ఇచ్చారు. ఆలిండియా మహిళా సాంస్కృతిక సంఘటన్ అధ్యక్షులు శోభ మాట్లాడుతూ 21వ శతాబ్దంలో కూడా ఆడపిల్లను పుట్టనివ్వని దుస్థితిని చూస్తు న్నామన్నారు. మహిళల పట్ల సమాజ దృక్పథం ఇంకా పాతకాలపు ఆలోచనలతోనే ఉందన్నారు.. భూస్వామ్య విలువలే అనుసరించబడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు కరువయ్యా యన్నారు. పెట్టుబడిదారీ విధానం వల్ల పేదరికం, నిరుద్యోగం వంటి అనేక సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. పాత కాలపు ఆలోచనలను విడనాడి భూస్వామ్య, పెట్టుబడిదారీ భావజాలాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని కోరారు. సమాజంలోని సమానత్వ భావనకు పెను ముప్పు పొంచి ఉందని ఆలిండియా ప్రోగ్రెసివ్ ఉమెన్స్ అసోసియేషన్ కార్యదర్శి నాగమణి అన్నారు. మహిళలు పోరాటాల ద్వారా సాధించుకున్న పురోగతిని, కష్టార్జితాన్ని నిర్వీర్యం చేసేలా చట్టాలను మారుస్తున్నారని విమర్శించారు. ఆశారాం బాపు, కుల్దీప్ సింగ్ వంటి లైంగిక దాడి నిందితులను విడుదల చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.. రాజకీయాల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం అనేది అందని ద్రాక్షలాగే ఉందన్నారు. తెలంగాణ బాస్కెట్ బాల్ క్రీడాకారిణి విహారెడ్డికి సన్మానం ఐద్వా అఖిల భారత మహాసభ వేదికపై తెలంగాణ బాస్కెట్ బాల్ క్రీడాకారిణి విహారెడ్డిని నాయకులు సన్మానించారు. ఆమె మరింత రాణించాలని ఆకాంక్షించారు.

# భక్తులు మెచ్చిన ఇప్పపువ్వు లడ్డు

- మేడారం జాతరలో భక్తులకు అందుబాటు
- మార్కెట్ లో మంచి డిమాండ్
- లడ్డు విక్రయ స్టాల్స్ ప్రారంభం
- గిరిజన మహిళలకు ఆర్థిక భరోసా




**ములుగు, జనవరి 26 :** ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర తెలంగాణ కుంభమేళా గా పేరు ప్రఖ్యాతలు కీర్తి ప్రతిష్ట పొందిన మేడారం మహా జాతరలో మొట్టమొదటిసారిగా ప్రత్యేకంగా గిరిజన మహిళ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో తయారుచేసిన అత్యంత పోషకాలు కలిగిన ఇప్పపువ్వు లడ్డు మేడారం వచ్చే భక్తులకు అందుబాటులో ఉంది. ఇప్పపువ్వు లడ్డు తినడం ద్వారా అధిక ప్రయోజనాలు చేకూరుతాయని నిపుణులు చెప్తున్నారు. జీర్ణ క్రియ మెరుగుపడడం రోగ నిరోధక శక్తిని పెంచడం గుండె కొలెస్ట్రాల్ తగ్గించడం అధిక శక్తిని పొందడం బరువు నియంత్రణ తో పాటు డయాబెటిస్ తగ్గించడంలో ఎంతగానో ఉపయోగపడు తుందని చెప్తున్నారు పూర్వకాలంలో ఆదివాసి గిరిజనులు ఇప్ప పువ్వును అనేక వ్యాధులకు ముందుగా ఉపయోగించేవారు అని ఇప్పటికీ గుత్తి కోయ గూడాలలో వారి పిల్లలకు ఇప్పపువ్వు కుడుములు లడ్డూలు తినిపియడం ద్వారా పిల్లలు పౌష్టికంగా బలంగా ఉంటారని గిరిజనులు చెప్తున్నారు. గర్భిణీ స్త్రీలు ఇప్పపూ లడ్డు తినడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని కూడా చెప్తున్నారు. ఇందులో ఉండే ఫైబర్ విటమిన్లు ఖనిజాలు పోషకాలు గర్భిణీ స్త్రీలకు ఎంతగానో మేలు చేస్తుందని పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరంగా జన్మిస్తారని చెప్తున్నారు. గిరిజన మహిళలకు ఆర్థిక భరోసా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది దానిలో భాగంగానే ఇప్పపువ్వు లడ్డు తయారీ ద్వారా గిరిజన మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తుంది. తెలంగాణ సమగ్ర జీవనోపాధి కార్యక్రమం ద్వారా గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం ద్వారా 12 మంది గిరిజన మహిళలతో ప్రత్యేకంగా సమ్మక్క సారలమ్మ మహిళ రైతు ఉత్పత్తుల సంఘం ఏర్పాటుచేసి వీరికి రాష్ట్ర గవర్నర్ దత్తత గ్రామం కొండపర్తి గ్రామంలో ఉట్నూర్ ఐటిడిఏ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ఇప్పపువ్వు లడ్డు తయారీ మరియు క్రయ విక్రయాల గురించి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి శిక్షణ అందించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తిలో ఇప్పపువ్వు లడ్డు తయారీ యూనిట్ ను ప్రారంభించడం జరిగింది. ఈసం మంగవేణి, ఇర్ప మంజుల , ఇర్ప మౌనిక, ఈసం సాంబలక్ష్మి, ఈసం వరలక్ష్మి వీరి ఆధ్వర్యంలో సమ్మక్క సారలమ్మ మహిళ రైతు ఉత్పత్తుల సంఘం ఏర్పాటు చేసి ఎంఎస్ఎమ్ఈ లో రిజిస్ట్రేషన్ చేసి ప్రత్యేకంగా ఫుడ్ లైసెన్స్ కూడా తీసుకోవడం జరిగింది. కన్నేపల్లి గ్రామం నుంచి చెరుప నాగమణి, గొండి అనురాధ, గొండి మాణిక్యం, గొండి స్వరూప వీరి ఆధ్వర్యంలో సార్ వాళ్ళ అమ్మ ఫుడ్ ప్రొడక్ట్స్ కూడా ఫుడ్ లైసెన్స్ పొందడం జరిగింది. మేడారం మహా జాతర వేదికగా జనవరి 13వ తేదీన ఇప్పపువ్వు లడ్డు స్టాల్స్ లను మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారుగా 3 లక్షల రూపాయల వ్యాపారం జరిగిందని నిర్వాహకులు చెప్తున్నారు.ప్రారంభించిన నాటి నుంచి భక్తుల నుంచి ఇప్ప పువ్వు లడ్డుకు మంచి ఆదరణ లభించడంతో పాటు మార్కెట్లో మంచి డిమాండ్ కూడా నెలకొంది. ఈనెల 18వ తేదీన జరిగిన మంత్రుల క్యాబినెట్ సమావేశంలో ఇప్పపువ్వు లడ్డులను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులతో పాటు అధికారులకు పంపిణీ చేశారు. మేడారం వచ్చే భక్తులకు జాతర పరిసరాలలో పది స్టాల్స్ ఏర్పాటు చేశామని ఒక బాక్స్ లో 250 గ్రాములతో 150 రూపాయలకు అందుబాటులో ఉంటుందని, మాకు సహకరిస్తున్న స్థానిక మంత్రి అనసూయ సీతక్కకి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గారికి, డి ఆర్ డి ఏ అధికారులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నారు. ఇప్పపువ్వు లడ్డు ద్వారా ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయని లడ్డు రుచి కూడా అమోఘంగా ఉందని గర్భిణీ స్త్రీలు ఎంతగానో ఉపయోగిస్తున్నారని కొనుగోలుదారులు చెప్తున్నారు.

# భారత్‌కు ప్రపంచదేశాల శుభాకాంక్షలు

## చైనా, రష్యా, అమెరికా తదితర దేశాల సందేశాలు

**న్యూఢిల్లీ, జనవరి 26 :** భారత 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాల నుంచి శుభాకాంక్షల సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. చైనా, రష్యా, అమెరికా, ఫ్రాన్స్, ఈయూ, ఇరాన్, నేపాల్, ఆస్ట్రేలియా, భూటాన్ మొదలైన దేశాల నుంచి సందేశాలు అందాయి. భారత్‌తో బంధాన్ని మరింత బలోపేతం చేసుకొంటామని ఈసందర్భంగా ఆయా దేశాధినేతలు, మంత్రులు పేర్కొన్నారు. 'భారత్ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్ష లు. చైనా, భారత్ ఎప్పటికీ మంచి పొరుగువారిగా, స్నేహితులుగా ఉంటాయి. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలను, సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని ఎదురుచూస్తున్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సందేశమిచారు. భారత ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్, ప్రపంచంలో పురాతన ప్రజాస్వామ్య దేశం యూఎస్‌ల మధ్య చరిత్రాత్మక సంబంధం కొనసాగుతోంది. రక్షణ, ఇంధనం వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో భారత్ అమెరికాల మధ్య సహకారం మంచి ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నాం. రాబోయే రోజుల్లో ఉమ్మడి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఎదురుచూ స్తున్నాం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొ న్నారు. భారత ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. న్యూదిల్లీ అంతర్జాతీయ అజెండాలోని కీలక సమస్యలను పరిష్కరించడంలో చురుకుగా వ్యవహరిస్తోంది. భారత్‌తో ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విలువైనదిగా భావిస్తున్నాం. మా ఉమ్మడి ప్రయత్నాల ద్వారా బహుళ రంగాలలో నిర్మాణాత్మక, ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ తెలిపారు. భారతీయులందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. గతంలో భారత్‌లో గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం ఎంతో విలువైన జ్ఞాపకం. భారత్, ఫ్రాన్స్‌ల బంధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ఫిబ్రవరిలో కలుద్దాం అంటూ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సందేశం వెలువరించారు. భారతీయులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. ఈ ఏడాది గణతంత్ర వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొనడం ఆనందంగా ఉంది. భారత్-ఐరోపా యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దిశగా పయనిస్తున్నాం. ఐరోపా యూనియన్‌తో భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత ముందుకువెళ్లాలని కోరుకుంటున్నాం యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లెయెన్ తెలిపారు.

## అమెరికాలో కుప్పకూలిన
# ప్రైవేట్ జెట్

### వెంటనే సహాయక చర్యలు చేపట్టిన అధికారులు

**వాషింగ్టన్, జనవరి 26 :** అమెరికాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. 8 మందితో వెళుతున్న ప్రైవేటు జెట్ ఈశాన్య రాష్ట్రమైన మైనేలోని బాంగోర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కుప్పకూలిపోయింది. ప్రమాదం జరగగానే మంటలు ఎగిసిపడటంతో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఆదివారం సాయంత్రం 7 గంటల 45 నిముషాలకు మైనేలోని బాంగోర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అవుతుండగా బాంబార్డియర్ ఛాలెంజర్ 600 విమానం కూలిపోయింది. ప్రమాద సమయంలో విమానంలో 8 మంది ఉన్నారు. ప్రమాదం జరగగానే ఎమర్జెన్సీ ప్రకటించారు. వెంటనే రన్ వేను మూసేశారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని, ప్రయాణికుల జాడ గురించి ఇంకా తెలియలేదని అధికారులు తెలిపారు. విమానం హోస్టన్ కు చెందిన ఒక కంపెనీపై రిజిస్టర్ అయినట్లుగా సమాచారం. ప్రస్తుతం ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విమానాశ్రయంలో శిథిలాల నుంచి పొగలు పైకి లేస్తున్నాయి.



# ప్రత్యేక ఆకర్షణగా మోడీ తలపాగా

### ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులాతో మోడీ

**న్యూఢిల్లీ, జనవరి 26 :** దేశంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ధరించిన తలపాగా అందరి దృష్టిని ఆకర్షించింది. అలాగే ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ భారతీయత ఉట్టిపడేలా డ్రెస్ ధరించారు. అయితే మరో అరుదైన దృశ్యం ఆవిష్కృతమయ్యింది. ఉర్సులాకు ప్రధాని మోదీ పరేడు వివరాలను ఎప్పటికప్పుడు వివరించారు. మోడీ వివరాలను ఆమె ఆసక్తిగా విన్నారు. ఇకపోతే ప్రధాని మోదీ ప్రకాశవంతమైన ఎరుపు, పసుపు, ఉదా, ఆకుపచ్చ రంగులు కలగలిసిన తలపాగాను ధరించారు. జరీతో నేసిన బంగారు రంగు మోటిఫ్‌లతో అది ఆకర్షణీయంగా కనిపించింది. ఈ రాజస్థానీ సంప్రదాయ తలపాగా.. పండగ వాతావరణాన్ని ప్రతిబింబించింది. అందులోని ఎరుపు.. అభిరుచి, ఉత్సుకత, ధైర్యసాహసాలకు నిదర్శనంగా చెప్తారు. అలాగే ముదురునీలం, తెలుపు రంగుల్లో ఉన్న కుర్తా పైజామా ధరించారు. పైన లేత నీలంలో ఉన్న జాకెట్ వేసుకున్నారు. మరోవైపు ఉర్సులా.. మెరూన్ రంగులో గోల్డ్ డిజైన్ చేసిన డ్రెస్ ధరించారు. ఈ వస్త్రధారణతో ఈ వేడుక కు తగ్గట్టుగా ఆమెలో భారతీయ సంప్రదాయం ఉట్టిపడింది. ఆమె సాధారణంగా ధరించే ప్యాంట్‌సూట్స్‌కు భిన్నంగా ఈ దుస్తులు వేసుకున్నారు.



## మువ్వన్నెల రెపరెపలతో
# హోరెత్తిన రహదారులు

- ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో "తిరంగా బైక్ ర్యాలీ"
- 400 బైకులు, 650 మంది యువతతో భారీ ప్రదర్శన
- ముఖ్య అతిథులుగా వజ్రేష్ యాదవ్, నక్క ప్రభాకర్ గౌడ్



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దేశభక్తి వెల్లివిరిసింది. ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన "తిరంగా బైక్ ర్యాలీ" అత్యంత వైభవంగా సాగింది. సుమారు 400 బైకులు, 650 మందికి పైగా యువకులతో ఉప్పల్ డిపో నుండి ప్రారంభమైన ఈ భారీ ర్యాలీ రహదారులన్నీ త్రివర్ణ శోభితమయ్యేలా చేసింది. భారత్ మాతాకీ జై అనే నినాదాలు, దేశభక్తి గీతాల మధ్య యువత ఉత్సాహంగా ర్యాలీలో కదిలారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఉప్పల్ డిపో వద్ద మొదలైన ఈ యాత్ర పీర్జాదిగూడ కమాన్, ఆరోరా కాలేజ్, సిపిఆర్ఐ రోడ్, మేడిపల్లి పోలీస్ స్టేషన్ మీదుగా వరంగల్ ప్రధాన రహదారి గుండా సాగి తిరిగి ఉప్పల్ డిపో వద్ద ముగిసింది. దారిపొడవునా ప్రజలు ర్యాలీకి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత గొప్ప రాజ్యాంగాన్ని బాబాసాహెబ్ అంబేద్కర్ మనకు అందించారని కొనియాడారు. జాతీయ స్ఫూర్తిని రగిలిస్తూ ఇంతటి భారీ కార్యక్రమాన్ని చేపట్టిన తుంగతుర్తి రవిని వారు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. పిలుపునిచ్చిన అతి తక్కువ సమయంలోనే వందలాదిగా తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేసిన యువకులకు, కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. యువతలో దేశభక్తిని, జాతీయ సమైక్యతను పెంపొందించే లక్ష్యంతోనే ఆర్.వి ఫౌండేషన్ తరపున ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, మహేష్ గౌడ్, కొత్త కిషోర్ గౌడ్, కొత్త సుశాంత్ గౌడ్, పోగుల నర్సింహా రెడ్డి, కర్రె రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కవడపు రాంరెడ్డి, అంజిరెడ్డి, యసారం మహేష్, పద్మారెడ్డి, సుమన్ నాయక్, కిరణ్ రెడ్డి, జంగచారి, భాస్కర్, పవన్ గౌడ్, రమేష్, మజర్, నాగరాజు, తవిటి ప్రశాంత్, సోమయ్య, ఉదయ్ గౌడ్, సాయిరాం, శరత్ గౌడ్, కపిల్, యువకులు తదితరులు పాల్గొన్నారు.



### ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**ఆత్మకూర్( ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి.జిల్లా ఆత్మకూర్ (ఎం) మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ నాగుల సత్యనారాయణ యాదవ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.



### మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

**సూర్యాపేట: రాజముద్ర న్యూస్ :** జిల్లా కేంద్రంలో సోమవారం మార్కండేయ పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మిట్టకోల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మార్కండేయ పద్మశాలి సంఘం కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగరవేశారు.



భారత రాజ్యాంగ స్ఫూర్తిని ఔన్నత్యాన్ని వివరిస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో భారత రాజ్యాంగ రథయాత్ర



ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల పరిధిలోని పల్లెర్ల గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగరవేసిన సర్పంచ్ తండా మంజుల నరసింహ గౌడ్.

## బిపిఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీలో
# మిన్నంటిన గణతంత్ర సంబరాలు

- మువ్వన్నెల జెండా నీడన ఒక్కటైన కాలనీ వాసులు
- దేశభక్తి చాటుకున్న చిన్నారులు, మహిళలు
- మేడిపల్లిలో ఘనంగా 77వ రిపబ్లిక్ డే వేడుకలు



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** దేశవ్యాప్తంగా సాగుతున్న 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు మేడిపల్లి డివిజన్ పరిధిలోని పర్వతాపూర్ బిపిఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీలో అత్యంత వైభవంగా జరిగాయి. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు అధ్యక్షులు మునికుంట్ల నరేష్ గౌడ్, సెక్రటరీ రావు నాగిరెడ్డి, కోశాధికారి ప్రదీప్ గౌడ్, అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కాలనీ వాసులు, కాలనీ యూత్ వింగ్ కులమతాలకు అతీతంగా, ఐక్యతతో పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. సోమవారం ఉదయం కాలనీ రోడ్ నెంబర్ 3 వద్ద ఏర్పాటు చేసిన వేదికపై జాతీయ పతాకాన్ని కాలనీ అధ్యక్షులు మునికుంట్ల నరేష్ గౌడ్ ఆవిష్కరించడంతో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

### మువ్వన్నెల రెపరెపలు - చిన్నారుల సందడి:

ఈ ఏడాది వేడుకల్లో చిన్నారుల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిం ది. స్వాతంత్ర్య సమరయోధులైన భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో వచ్చిన విద్యార్థులు అందరినీ ఆకట్టుకున్నారు. జై హింద్, భారత్ మాతా కీ జై అనే నినాదాలతో కాలనీ పరిసరాలు మారుమోగిపోయాయి. చిన్నారి విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నృత్యాలు గీతాలాపన చూసిన పెద్దలు వారిని అభినందనలతో ముంచెత్తారు.

### మహిళల భాగస్వామ్యం:

వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దేశాభివృద్ధిలో మహి ళల పాత్ర రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి చర్చించారు. కాలనీలోని మహిళా సభ్యులు జాతీయ పతాకం ముందు ముగ్గులు వేసి, దేశభక్తిని చాటారు. మహిళల భాగస్వామ్యంతో వేడుకలు మరింత శోభాయమానంగా మారాయి.

### ముగింపు కార్యక్రమాలు:

కార్యక్రమం చివరలో వేడుకలకు హాజరైన ప్రతి ఒక్కరికీ చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కాలనీ ప్రెసిడెంట్, సెక్రటరీ, కార్యవర్గ సభ్యులతో పాటు స్థానిక ప్రజలు ఈ వేడుకను ఒక పండుగలా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, క్రమశిక్షణతో ఈ గణతంత్ర వేడుకలు దిగ్విజయంగా ముగిశాయి.

### కాలనీ ప్రజల ఐక్యత:

జెండా ఆవిష్కరణ అనంతరం కాలనీ పెద్దలు మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకుంటూ, కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. 77 ఏళ్ల స్వయంపాలనలో మనం సాధించిన ప్రగతిని గుర్తు చేసుకుంటూ, భవిష్యత్ తరాలకు దేశభక్తిని పెంపొందించాల్సిన బాధ్యత మనపై ఉందని ఉద్ఘాటించారు.







# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

## జాతీయ జెండా ఆవిష్కరించిన సర్పంచ్ యెర్ర సోమిరెడ్డి

**ఆత్మకూర్(ఎం) రాజముద్ర న్యూస్ :** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా లింగరాజుపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించిన వైయస్సార్ ఫౌండేషన్ అధినేత ఆత్మకూరు మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు గ్రామ సర్పంచ్ యెర్ర సోమిరెడ్డి అనంతరం వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి నేటితో 77 ఏళ్లు అవుతున్న సందర్భంగా దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.రాజ్యాంగం ద్వారా సంపూర్ణ స్వేచ్ఛ సమానత్వం లౌకికతత్వం న్యాయాన్ని పూర్తి స్థాయిలో ఒక హక్కుగా పొందడం జరిగిందని పేర్కొన్నారు.గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తా గ్రామ అభివృద్ధి విషయంలో రాజకీయం చెయ్యొద్దు అందరం కలిసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిద్దిదాలని అన్నారు అనంతరం వైయస్సార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలుగా గెలుపొందిన వారికీ బహుమతులు అందజేశారు. సర్పంచ్ యెర్ర సోమిరెడ్డి గ్రామ పంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మాంచారు. ఈ



కార్యక్రమంలో కార్యదర్శి మచ్చేందర్ ఉపసర్పంచ్ ఇంజమూరి బిక్షపతి వార్డు సభ్యులు గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

### సర్వేపల్లి గ్రామంలోగణతంత్ర దినోత్సవం



**ఆత్మకూరు( ఎం).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల పరిధిలోని సర్వేపల్లి గ్రామంలో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్వతంత్ర కోసం పోరాడిన మహనీయులకు గ్రామపంచాయతీ దగ్గర పూలమాలలు అర్పించి జాతీయ జెండాను ఎగరవేసిన సర్పంచ్ కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏష బోయిన వెంకటేష్, వార్డ్ మెంబర్స్ మచ్చ రాజు, కోమ్ము స్వామి, జామండ్ల సునీత జగన్,మద్రిపల్లి అండాలు,గ్యార నరేష్,మణిపూరి మాధవి, పంది మహేష్, మాజీ సర్పంచ్ ఎల్లయ్య ,కారోబార్ పంది స్వామి, పంచాయతీ సెక్రెటరీ ఇంజా నరేష్, పంది రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ సంబురాలు

- బీఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఏదవల్లి రఘువర్ధన్ రెడ్డి
- ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి
- రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటమే మన బాధ్యత : మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** దేశవ్యాప్తంగా సాగుతున్న 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్ల లో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం దేశ భక్తి నినాదాల మధ్య ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

### రాజ్యాంగం మన ప్రజాస్వామ్యానికి పునాది:

ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నతమైనదని కొనియాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులు మన ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదులని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుంటూ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ మాట్లాడుతూ... రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛ, హక్కులు ప్రతి పౌరునికి గర్వకారణమని, వాటిని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని తెలిపారు. దేశాభివృద్ధి కోసం సమాజంలోని ప్రతి వర్గం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**కార్యాలయాల్లో, పలు కాలనీల్లో వేడుకలు:** మేడిపల్లి డివిజన్ పరిధిలోని ఐఐసిటి కాలనీలో, ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జక్క వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్ల పరిధిలోని పలు కాలనీలలో పర్యటించిన ఆయన, స్థానిక ప్రజలతో కలిసి జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సమాజ అభివృద్ధిలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో అవసరమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

### భారీగా తరలివచ్చిన నేతలు - శ్రేణులు:

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల పాల్గొన్నారు. వీరితో పాటు సీనియర్ నాయకులు జావీద్ ఖాన్, యూత్ అధ్యక్షులు ప్రభు, ఆంజనేయులు, గడీల జగన్ రెడ్డి, బాలరాజు, వరికల శ్రీనివాస్, శ్యామల సాయిలు, శ్యామల నర్సింహా, శ్యామల శ్రీనివాస్, ప్రవీణ్ రెడ్డి, అశోక్, అక్షిత్, రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అమర్ పటేల్, సత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాలనీల వ్యాప్తంగా దేశభక్తి గీతాలు మారుమోగగా, చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యకర్తలు నాయకుల భారీ భాగస్వామ్యంతో పీర్జాదిగూడలో గణతంత్ర వేడుకలు అట్టహాసంగా ముగిశాయి.





# ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



## ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్‌గా దేవరకొండ అమృతాచారి

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** నిజాయితీ, విధి నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ ఉత్తమ సేవలు అందించినందుకు గాను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న దేవరకొండ అమృతాచారికి జిల్లా యంత్రాంగం గుర్తింపు ఇచ్చింది. మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమృతాచారి సేవలను ప్రశంసిస్తూ ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్‌గా ప్రశంస పత్రం అందజేశారు. కార్యాలయ పనుల్లో సమయపాలన, బాధ్యతాయుతంగా డేటా నిర్వహణ, ప్రజా సేవల పట్ల నిబద్ధతతో పనిచేస్తున్నారని కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని అమృతాచారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు ఆయన ఒక ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు ప్రశంసించారు.



## కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న పశుసంవర్ధక శాఖ అధికారి

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామంలో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారి నారాయణ గణతంత్ర దినోత్సవ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు, ఉత్తమ సేవలు చేసిన వారికి ఈ పత్రాన్ని అందిస్తారు, నా పనితనాన్ని గుర్తించి నాకు ప్రశంస పత్రం ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని పశుసంవర్ధక శాఖ అధికారి నారాయణ అన్నారు, పై అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



సూర్యాపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్.



**ఆత్మకూర్ (ఎం )రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం).మండలం పల్లెర్ల గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 77వ గణతంత్ర వేడుకలు జరిగాయి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జామ శంకర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.




## డీసీఎం, జనరేటర్ దొంగల ముఠా గుట్టురట్టు

### - ఇద్దరు అరెస్ట్, వాహనం స్వాధీనం

**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్:** నగరంలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను బాలానగర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ. 3.5 లక్షల విలువైన డీసీఎం వాహనంతో పాటు జనరేటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి వెల్లడించారు. సోమవారం బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ నర్సింహారాజు, డిఐ సక్రమ్, ఎస్ఐ సరితా రెడ్డి తో కలిసి కేసు వివరాలను తెలియజేశారు. ఈ నెల 18న బాలానగర్ ఐడీపీఎల్ హట్స్ సమీపంలోని ప్రహ్లాద్ టింబర్ డిపో పార్కింగ్ స్థలంలో నిలిపి ఉంచిన డీసీఎం చోరీకి గురైంది అని వాహన యజమాని యూసఫ్ బాబా ఈ నెల 21న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న క్రైమ్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సీసీటీవీ ఫుటేజ్, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సుమారు 350 కిలోమీటర్లు దాదాపు 225 సీసీటీవిలు పరిశీలించి నిందితులు కర్ణాటకలోని బసవకళ్యాణ్ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. వారి కదలికలపై నిఘా ఉంచి, నిందితుల నివాస స్థావరంపై దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా, దొంగిలించిన డీసీఎం మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా, కోరేలి గ్రామంలో దాచినట్లు నిందితులు అంగీకరించారు. పోలీసులు ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. మహమ్మద్ ఖదీర్ (35), మహమ్మద్ తాజుద్దీన్ (42) మరో ఇద్దరు నిందితులు దిగ్య, ఫాకరుద్దీన్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని ఏసీపీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. సమర్థవంతంగా పనిచేసి నిందితులను పట్టుకున్న క్రైమ్ బృందం ఏఎస్ఐ హనుమయ్య, పీసీలు కృష్ణ, ఇఫతేకర్, శ్రీనివాస్, జకీర్ లను ఈ సందర్భంగా ఏసీపీ అభినందించి నగదు పురస్కారాలు అందించారు.

- పలు కాలనీల్లో జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ కోఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి
- సామాజిక సేవలో భాగంగా మెగా హెల్త్ క్యాంప్ నిర్వహణ
- పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు కె.వి. గౌడ్, కాలనీ ప్రతినిధులు







**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** దేశవ్యాప్తంగా కొనసాగుతున్న 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సంబురాలు మేడిపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో మిన్నంటాయి. మేడిపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సోమవారం జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. మాజీ కోఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి పలు కాలనీలలో పర్యటించి మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతతో జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించింది. నిపుణులైన వైద్యులు ప్రజలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని, పేద ప్రజలకు వైద్యం చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.వి. గౌడ్ పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం కల్పించిన హక్కులు మరియు బాధ్యతల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కాలనీల అంతటా దేశభక్తి గీతాలతో సందడి వాతావరణం నెలకొంది.

## వాడవాడలా రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

- మేడిపల్లి డివిజన్ పరిధిలో అట్టహాసంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు
- పలు కాలనీలలో జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మేడిపల్లి డివిజన్ వ్యాప్తంగా దేశభక్తి వెల్లువెత్తింది. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో జాతీయ జెండా రెపరెపలాడింది. 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి వివిధ కాలనీలలో పర్యటించి, స్థానిక కాలనీ వాసులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. డివిజన్ పరిధిలోని శ్రీ సాయి ఎంక్లేవ్, విహారిక కాలనీ, మేడిపల్లి ప్రధాన కూడలితో పాటు పలు బస్తీలలో హరిశంకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వాలను కాపాడుకుంటూ దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహనీయుల త్యాగఫలమే నేటి మన స్వయంపాలన అని, వారి ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాలనీలలో చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. స్థానికులతో కలిసి భారత్ మాతా కీ జై, వందేమాతరం నినాదాలతో మేడిపల్లి పరిసరాలు మారుమోగాయి. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్లు, స్థానిక నాయకులు, మహిళలు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.





## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 'పిఆర్సి యూత్' అండ

- పెంటారెడ్డి కాలనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా బెల్టుల పంపిణీ
- విద్యార్థులకు అండగా నిలుస్తున్న పిఆర్సి యూత్ ప్రతినిధులు

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** సామాజిక సేవే లక్ష్యంగా బోడుప్పల్ సర్కిల్ పరిధిలో పిఆర్సి యూత్ తమ ఉదారతను చాటుకుంది. పెంటారెడ్డి కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు సోమవారం పిఆర్సి యూత్ ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ బెల్టులను పంపిణీ చేశారు. పాఠశాల క్రమశిక్షణలో భాగంగా విద్యార్థుల డ్రెస్ కోడ్‌ను పూర్తిస్థాయిలో మెరుగుపరిచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు యూత్ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు చిన్నపాటి సహాయం అందించినా అది వారి చదువుపై ఎంతో ప్రభావం చూపుతుందని ఈ సందర్భంగా పిఆర్సి యూత్ సభ్యులు పేర్కొన్నారు. నాణ్యమైన బెల్టులను అందుకున్న విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల అవసరాలను తీర్చడానికి తమ వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని వారు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సేవా కార్యక్రమంలో పిఆర్సి యూత్ ప్రతినిధులు మధు సురేంద్ర నాయుడు, ముత్యమాచారి, రామకృష్ణ రాజు, లింగయ్య, సంపత్ రెడ్డి, నవీన్, అజయ్, అరుణ్, జీవన్ రావు పాల్గొన్నారు. వీరు స్వయంగా విద్యార్థులకు బెల్టులను అలంకరించి వారిని ప్రోత్సహించారు. యువత కేవలం వినోదాలకే పరిమితం కాకుండా, ఇలా సామాజిక బాధ్యతతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం కొనియాడారు. పిఆర్సి యూత్ చేస్తున్న ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని వారు ఆకాంక్షించారు.

## శ్రీ చైతన్య పాఠశాలల్లో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు



**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** ఉప్పల్ డిపో, బోడుప్పల్ ప్రాంతాల్లోని శ్రీ చైతన్య ఈ-టెక్నో, ప్రైమ్, ఒలింపియాడ్ పాఠశాలల్లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశభక్తి స్ఫూర్తితో మిన్నంటాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం సమక్షంలో ఈ వేడుకలు కన్నులపండువగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ సామ అశోక్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సామ శోభారాణి, డైరెక్టర్ సామ అభిషేక్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ గొప్పతనాన్ని, ప్రతి పౌరుడు పాటించాల్సిన బాధ్యతలను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ జాతీయ విలువలను కాపాడాలని పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను చాటిచెప్పేలా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించా యి. దేశభక్తి నృత్యాలు, జాతీయ గీతాలకు విద్యార్థులు వేసిన అడుగులు దేశభక్తిని పెంపొందించాయి. గణతంత్ర నేపథ్యంపై విద్యార్థులు అనర్గళంగా మాట్లాడారు. విద్యార్థులు సాహసో పేతమైన విన్యాసాలతో తమ ఆత్మవిశ్వాసాన్ని చాటారు. పదవ తరగతి టాపర్లకు సత్కారం చేశారు. ఈ వేడుకల్లో భాగంగా 2024--2025 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టాపర్లను సామ అశోక్ రెడ్డి ఘనంగా సత్కరించారు. విద్యార్థుల అంకితభావాన్ని అభినందిస్తూ, వారి విజయాలు తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు దేశం పట్ల గర్వంతో అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో ముగిశాయి.






సూర్యాపేట ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



**ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్:.** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం).మండలం కూరెళ్ల గ్రామంలో కూరెళ్ళ గ్రామ పోస్ట్ ఆఫీస్ వద్ద 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మేడి అంజయ్య జాతీయ జెండా ఆవిష్కరించారు.



సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసిన జిల్లా ఎస్పీ నరసింహ. ఎస్పీ వెంట అదనపు ఎస్పీలు రవీందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, పరిపాలన అధికారి మంజు భార్గవి, డి.ఎస్.పి ప్రసన్నకుమార్ డిఎస్పి నరసింహ చారి, ఇన్స్పెక్టర్లు,



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** మాసాని గూడ గ్రామంలో సోమవారం రోజు గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. గ్రామ నూత న సర్పంచ్ బద్రి అర్చన గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన జండా వందనం కార్యక్రమంలో గ్రామ వార్డు మెంబర్లు, మాజీ సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్, గ్రామస్తుల అందరూ కలిసి ఘనంగా జరుపుకున్నారు.



**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** మండలంలోని అన్ని గ్రామాలలో 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు, కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, యువకులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ జెండాకు అవమానం

- రెండు గ్రామాల లొల్లితో ఆలస్యంగా జెండా ఎగురెసిన వైనం
- చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

**గాంధారి, రాజముద్ర న్యూస్ :** కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని మొండి నడక్ గ్రామంలో జాతీయ జెండాకు అవమానం జరిగింది. ఈ గ్రామ పంచాయతీ వరిధిలో నర్సాపూర్, మొండి నడక్ గ్రామాలు ఉండగా ప్రతి ఏటా మొండి నడక్ గ్రామ వంచాయతీ వద్దనే అన్నీ కార్యక్రమాలు నిర్వహిస్తారని పలువురు గ్రామస్తులు తెలిపారు. అయితే సోమవారం జనవరి 26 రిపబ్లిక్ వేడుకల్లో భాగంగా ఇక్కడ గ్రామ పంచాయతీ వద్ద ఎగుర వేయాల్సిన జెండాను ఆలస్యంగా అంటే సుమారు వది తరువాతనే ఎగుర వేయడం పట్ల గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై నర్పంచి సాయిలు –మాట్లాడుతూ... తనకు అనారోగ్యం వల్లనే జెండా ఎగుర వేయలేదని, ఈ విషయం అధికారులకు చెప్పానన్నారు. ఈ విషయమై వంచాయతీ కార్యదర్శిని అడుగగా సర్పంచికి అనారోగ్యం ఉందని, అందుకే మేము జెండాను ఎగుర వేశామన్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా గ్రామ పంచాయతీ కార్యాలయం అపరిశుభ్రంగా ఉందని, జెండాను వది తరువాతనే నామ మాత్రంగా నలుగురు, ఐదుగురి ఉండి ఎగుర వేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఈ విషయమై పలువురు గ్రామస్తులు చూట్లాడుతూ.. మొండి నడక్, నర్సాపూర్ గ్రామాలు రెండు ఉండగా మొన్నటి వంచాయతీ ఎన్నికల్లో నర్సాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి సర్పంచిగా గెలిచారు. దీంతో గ్రామ పంచాయతీని తమ గ్రామంలో పెట్టుకుందామనే ఉద్దేశ్యంతో జాతీయ జెండాను నర్సాపూర్లో సర్పంచి ఎగుర వేశారని, ఇక్కడికి రావడానికి మాత్రం జ్వరం అనే తప్పుగా చెప్పారని, జెండా విషయంలో ఇలా ప్రవర్తించిన అతనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని మొండి నడక్ గ్రామ ప్రజలు వలువురు డిమాండ్ చేశారు. ఏది ఏమైనా గ్రామ సమస్యలను కూర్చొని మాట్లాడుకొనే దానికి జాతీయ జెండా విషయంలో వంగాలకు పోవడం ఏమిటని పలువురు విద్యావంతులు వారి తీరుపై అసహనం వ్యక్తం చేశారు.



**ఆత్మకూరు (ఎం).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకురు (ఎం) మండల పరిధిలో పారుపల్లి గ్రామంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినారు గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దయ్యాల మాధవి శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగిరివేశారు



**ఆత్మకూరు (ఎం), రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మత్స్యశాఖ,ముదిరాజ్ సంఘం అధ్యక్షులు యాట వెంకటేష్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దండు ప్రసన్న ,జినుకల నరసింహ,దండు గోపాల్,దండు రాజు,కిష్టయ్య,వెంకటేష్, కోట వెంకన్న,లింగయ్య,ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రం అందుకున్న ఏఓ సీతారాం రెడ్డి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** రైతాంగ సమస్యల పరిష్కారంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సేవలందించిన తిరుమలాయపాలెం మండల వ్యవసాయశాఖ అధికారి నారెడ్డి సీతారాం రెడ్డి ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రం అందుకున్నారు.గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ఇచ్చే అవార్డును జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా సోమవారం ఆయన అందుకున్నారు.విధి నిర్వహణలో భాగంగా రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ,క్షేత్రస్థాయిలో పంటలను సందర్శిస్తూ అందించిన సేవలకు ఆయనకు ఉత్తమ ఉద్యోగిగా అవార్డు లభించింది.ఆధునిక సాగు పై రైతులకు అవగాహన కల్పించడంలో ఆయన సఫలీకృతులయ్యారు.ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందుకోవడం పట్ల తోటి ఉద్యోగులు,అధికారులు,రాజకీయ పార్టీల నాయకులు,రైతులు సీతారాంరెడ్డికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

# వెనెజువెలాపై అమెరికా ఆపరేషన్

## రహస్య ఆయుధం పేరు వెల్లడించిన ట్రంప్

**వాషింగ్టన్:** వెనెజువెలా ఆపరేషన్లో ఉపయోగించిన రహస్య ఆయుధం పేరు ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడిం చారు. ఆ దేశ సైన్యాన్ని నిర్వీర్యం చేసేం దుకు తమ బలగాలు 'ది డిస్కాం బోబు లేటర్' వాడినట్లు తెలిపారు. అమెరికా దళాలు ఆ ఆయుధాన్ని వాడగానే ప్రత్య ర్థుల వెపన్స్ పని చేయలేదని ట్రంప్ పేర్కొన్నారు. దీని గురించి ఎక్కువగా మాట్లాడేందుకు తనకు అనుమతి లేదని చెప్పారు. "వారి వద్ద రష్యా, చైనా రాకెట్లు ఉన్నాయి. కానీ వాటిని ప్రయో గించలేకపోయారు. మేము రాగానే.. వారు బటన్స్ నొక్కినా అవేవీ పనిచేయలేదు" అని తమ ఆయుధం గురించి వెల్లడించారు. వెనెజువెలాపై మెరుపుదాడి చేసి ఆ దేశ నేత నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా దళాలు నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అగ్రరాజ్యం ఓ రహస్య ఆయుధాన్ని ఉపయోగించినట్లు కథనాలు వచ్చాయి. సీక్రెట్ సోనిక్ వెపన్ను వినియోగించినట్లు కొన్నిరోజుల క్రితం ధ్రువీకరించిన ట్రంప్.. తాజాగా దాని పేరు వెల్లడించారు.

# ఏదులాపురం మున్సిపాలిటీని రోల్ మోడల్గా తీర్చుదిద్దుతా

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- రూ 2.5 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** రాబోయే రోజుల్లో ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక ఆదర్శవంతమైన (రోల్ మోడల్) మున్సిపాలిటీగా తీర్చుదిద్దడమే తన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో సుమారు రూ. 2.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన సిసి రోడ్లు డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ పర్యటనలో భాగంగా మంత్రి కోట నారాయణపురంలో రూ. 22.6 లక్షలతో సిసి డ్రైను నిర్మాణానికి,ఎస్సీ,బీసీ కాలనీలో రూ. 72 లక్షల వ్యయంతో అంతర్గత సిసి రోడ్లు,డ్రైన్ల పనులకు శంకుస్థాపన చేశారు.అలాగే గుదిమళ్ళలో రూ. 44.55 లక్షలతో,ఇందిరమ్మ కాలనీ-1లో రూ. 75.85 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సి.సి. రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. వీటితో పాటు నంద్యాతండాలో రూ. 26.55 లక్షల వ్యయంతో డ్రైన్లు, జంగాల కాలనీలో రూ. 14.10 లక్షలతో సి.సి. రోడ్లు, డ్రైన్ల పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే పూర్తి బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు తెలిపారు.పేదవాని కష్టం తెలిసిన ప్రభుత్వం తమదని, అందుకే అర్హులైన ప్రతి పేదవానికీ ఇళ్లతో పాటు ఇళ్ల స్థలాలు కూడా ఇస్తామని అన్నారు.ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని చెప్పారు.సంక్షేమ పథకాల అమలులో ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు.గత ప్రభుత్వం రైతు బంధు కింద రూ. 10 వేలు మాత్రమే ఇస్తే, తమ ప్రభుత్వం రైతు భరోసా కింద రూ. 12 వేలు అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల దీవెనలు తమ ప్రభుత్వంపై ఉండాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రంలో మోదీ, రాష్టంలో కాంగ్రెస్..

# దొందు...దొందే..!!

- పథకాల పేర్ల రాజకీయంపై రచ్చ...రచ్చ
- మోదీ-రేవంత్ ఒక్కటేనా...? ఎంపీని నిలదీసిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు
- భువనగిరి ఎంపీకి ఓబుల్ కేశవాపూర్లో నిరసన సెగ



**జనగామ, రాజముద్ర న్యూస్:** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్పును వ్యతిరేకిస్తూ గ్రామంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి విచ్చేసిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఓబుల్ కేశవాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. గ్రామంలో ధర్నా నిర్వహిస్తున్న ఎంపీని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నల వర్షంతో నిలదీశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేస్తూ ఎంపీకి మెమోరాండం అందజేశారు. గ్రామంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం పేరు మార్చితే గల్లీల్లో ధర్నాలు చేస్తున్న మీరు, అదే తరహాలో రాష్ట్రంలో గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాల పేర్లు మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, మోదీకి మధ్య తేడా ఏముందని వారు ప్రశ్నించారు. రైతుబంధును రైతు భరోసాగా, ఆసరా పెన్షన్లను చేయూతగా, బతుకమ్మ చీరలను ఇందిరమ్మ చీరలుగా, డబుల్ బెడ్రూం ఇళ్లను ఇందిరమ్మ ఇళ్లుగా పేరు మార్చారని విమర్శించారు. అలాగే తెలంగాణ తల్లిని పక్కనపెట్టి కాంగ్రెస్ తల్లిని తీసుకువచ్చారని ఆరోపించారు. ఈ మార్పులన్నింటికి ముందుగా సమాధానం చెప్పాకే గ్రామం నుంచి వెళ్లాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తమ్మలి పరుశరాములు, మాజీ సర్పంచ్ ధర్మ జయప్రకాష్ నారాయణ రెడ్డి,టిఆర్ఎస్ పార్టీ వార్డ్ మెంబర్లు, టిఆర్ఎస్ నాయకులు పంబాల సుధాకర్, టిఆర్ఎస్ పార్టీ గ్రామ యువకుల లతోపాటు తదితరులు పాల్గొన్నారు.



# హక్కులతో పాటు, బాధ్యతలను గుర్తించాలి

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం,రాజముద్ర న్యూస్ :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్థానిక లకారం ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కలెక్టర్ సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గణతంత్రం అంటే కేవలం హక్కులు మాత్రమే కాదని, బాధ్యతలు కూడా అని అన్నారు. దేశాభివృద్ధిలో మన వంతు పాత్ర పోషించినప్పుడే రాజ్యాంగ ఆశయాలు నెరవేరుతాయన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలో రూపొందించబడిన మన రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగమని తెలిపారు. మన రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, కోట్లాది భారతీయుల స్వేచ్ఛ, సమానత్వం న్యాయానికి సజీవ సాక్ష్యమని అన్నారు. కుల, మత, వర్గ విభేదాలు లేకుండా ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించిన గొప్ప పత్రం మన రాజ్యాంగమని కలెక్టర్ అన్నారు.గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్, శ్రీ చైతన్య విస్ట, న్యూ విజన్ హైస్కూల్, టిజిడబ్ల్యుఆర్ఎస్, టేకులపల్లి, కెజిబివి అర్బన్, హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్, తెలంగాణ విద్యారణ్య స్కూల్ ల దేశభక్తి స్ఫూరించే గేయాలు, క్లాసికల్, మాస్, జానపద గేయాలకు నృత్యాలు వీక్షకులను ఎంతో అలరించాయి.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా విద్యాధికారిని చైతన్య జైని, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాస చారి, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, అధికారులు, పెద్ద సంఖ్యలో వీక్షకులు పాల్గొన్నారు.

# 75 దేశాలకు వీసాల బ్రేక్

## అందుబాటులోకి 50వేల గ్రీన్కార్డులు..




**యూఎస్ :** వలసదారుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తోన్న అమెరికా ప్రభుత్వం.. ఇటీవల 75 దేశాల పౌరులకు వీసా ప్రాసెసింగ్ను నిలిపివేసింది. ఈ నిర్ణయంతో 2027 సంవత్సరానికి గానూ గ్రీన్కార్డు కోటా పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. కుటుంబ ఆధారిత గ్రీన్కార్డులను.. ఉద్యోగ ఆధారిత కేటగిరీకి బదిలీ చేస్తే ఈ అదనపు గ్రీన్ కార్డులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఇమిగ్రేషన్ అటార్నీ ఎమిలీ న్యూమన్ వెల్లడించారు. సాధారణంగా వీసా ప్రాసెసింగ్ను నిలిపివేయకపోతే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ 75 దేశాలకు దాదాపు 67వేల ఇమిగ్రెంట్ వీసాలను జారీ చేసేవారు. జనవరి 21 నుంచి ఈ దేశాల పౌరులకు వీసా ప్రాసెసింగ్ నిలిపివేశారు. అయితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ అక్టోబరు 1 నుంచి ఇప్పటికే ఈ దేశాలకు చెందిన పౌరులకు కొన్ని వీసాలు జారీ అయ్యాయి. ఈ లెక్కన చూసుకుంటే.. ఈ దేశాలపై నిషేధం అమలైతే వచ్చే ఏడాదికి గానూ అదనంగా మరో 50వేల గ్రీన్కార్డులు అందుబాటులో ఉండే అవకాశం ఉందని ఇమిగ్రేషన్ అటార్నీ వివరించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా, అఫ్గానిస్థాన్, బ్రెజిల్, ఈజిప్టు, ఇరాన్, ఇరాక్ సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్ను అమెరికా నిలిపివేసింది. అమెరికా ప్రభుత్వ పథకాలపైనే వారు ఎక్కువగా ఆధారపడి జీవించే అవకాశాలు ఉన్నాయని, అందుకే ఈ చర్యకు ఉపక్రమించామని అగ్రరాజ్యం తెలిపింది. కొత్త వలసదారులు అమెరికన్ల సంపదను దొంగిలించకుండా, వారు తమకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంతవరకూ ఈ నిలిపివేత అమల్లో ఉంటుందని పేర్కొంది. 2024 డేటా ప్రకారం.. కుటుంబ ఆధారిత గ్రీన్కార్డుల కోటాలో అత్యధికంగా పాకిస్థాన్ (15వేలు) పౌరులకు దక్కాయి. ఆ తర్వాతి స్థానంలో బంగ్లాదేశ్ (8వేల గ్రీన్కార్డులు) ఉంది.

# రిపబ్లిక్ డే పరేడ్లో పురుషుల బృందానికి లేడీ లీడ్



**న్యూఢిల్లీ :** దిల్లీలోని కర్తవ్యపథ్లో జరిగిన గణతంత్ర వేడుకల పరేడ్లో 26 ఏళ్ల సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సిమ్రన్ బాలా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గణతంత్ర దినోత్సవ కవాతులో పారామిలిటరీ దళానికి చెందిన పురుషుల బృందానికి ఆమె నాయకత్వం వహించి, చరిత్ర సృష్టించారు. దేశంలోనే అతిపెద్ద పారామిలిటరీ దళానికి చెందిన 147 మంది పురుష సిబ్బంది బృందాన్ని ఆమె ముందుండి నడిపారు. కర్తవ్యపథ్లో ఫోర్స్ బ్యాండ్ వాయించిన 'దేశ్ కే హమ్ హై రక్షక్' అనే సీఆర్పీఎఫ్ గీతానికి అనుగుణంగా బృందం కవాతు చేసింది. గణతంత్ర పరేడ్లోని బృందాలకు గతంలోనూ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్కు చెందిన అధికారిణులు నాయకత్వం వహించినప్పటికీ.. పూర్తిస్థాయిలో పురుషుల బృందానికి ఓ మహిళ నాయకత్వం వహించడం ఇదే మొదటిసారి. జమ్మూకశ్మీర్లోని రాజౌరీలో పాక్ సరిహద్దుకు 11 కిలోమీటర్ల దూరంలోని నౌషెరా గ్రామంలో జన్మించిన సిమ్రన్ జమ్మూలోని గాంధీనగర్లో ఉన్న ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి రాజకీయ శాస్త్రంలో పట్టభద్రురాల య్యారు. ఏడాది కిందటే సీఆర్పీఎఫ్ దళంలో చేరారు. ఆ జిల్లా నుంచి పారామిలిటరీ దళంలో ఆఫీసర్ హోదాలో చేరిన మొదటి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం ఆమె ఛత్తీస్గఢ్లోని 'బస్తారియా' బెటాలియన్లో విధులు నిర్వర్తిస్తున్నారు. సిమ్రన్ తండ్రి, తాత కూడా ఆర్మీలో పని చేశారు.



### మొదటిసారిగా.. 'సూర్యాస్త్ర'

పరేడ్లో వివిధ ఆయుధ వ్యవస్థల ప్రదర్శనలో భాగంగా 300 కి.మీ. దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలిగే 'సూర్యాస్త్ర' రాకెట్ లాంఛర్ వ్యవస్థను ప్రదర్శించారు. మొట్టమొదటిసారిగా ప్రదర్శించిన ఈ 'సూర్యాస్త్ర' బృందానికి భారత సైన్యంలోని ఆర్టిలరీ రెజిమెంట్ అధికారిణి లెఫ్టినెంట్ మెహక్ భాటి నాయకత్వం వహించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ.. పరేడ్లో 'సూర్యాస్త్ర' బృందాన్ని లీడ్ చేయడం గర్వంగా ఉందన్నారు. ఈ రాకెట్ లాంచర్ వ్యవస్థను భారత సైన్యంలోకి ప్రవేశపెట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. ఇది ఒకే లాంచర్ నుంచి బహుళ క్యాలిబర్ల రాకెట్లను ప్రయోగించగలదని, దీర్ఘ-శ్రేణి దాడుల సామర్థ్యాన్ని పెంచుతుందని తెలిపారు. మెహక్ భాటి ఉత్తర్ప్రదేశ్లోని మీరట్కు చెందిన రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. ఆమె నానమ్మ, తండ్రి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు.



## భారత నూలుకు డ్యూటీ-ఫ్రీ

# సౌకర్యం తొలగించాలి

## బంగ్లాదేశ్ వస్త్ర పరిశ్రమ

**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా మహమ్మద్ యూనస్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి భారత్-బంగ్లాల మధ్య దౌత్య, వాణిజ్య సంబం ధాలు వేగంగా క్షీణిస్తూ వచ్చాయి. మరోవైపు ఆ దేశంలోని హిందువులపై దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్కు వ్యతిరేకంగా అక్కడి వస్త్ర పరిశ్రమ వర్గాలు మరో డిమాండ్ను తెర పైకి తీసుకువచ్చాయి. ఇప్పటివరకు భారత నూలుకు బంగ్లాదేశ్లో ఉన్న డ్యూటీ-ఫ్రీ సౌకర్యం తొలగించాలని పట్టుబట్టాయి. లేదంటే ఫిబ్రవరి 1 నుంచి కర్మాగారాలు మూసివేస్తామని బంగ్లా ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఈ మేరకు ఆ దేశ వాణిజ్యశాఖ నుంచి నేషనల్ బోర్డ్ ఆఫ్ రెవెన్యూకు లేఖ అందినట్లు యూనస్ ప్రభుత్వం పేర్కొంది. జనవరి చివరి నాటికి భారత నూలుకు సుంకం లేని దిగుమతి సౌకర్యాన్ని ఉప సంహరించుకోకపోతే దేశవ్యాప్తంగా అన్ని స్పిన్నింగ్ యూనిట్లలో కార్యకలాపాలు నిలిపేస్తామని దేశీయ మిల్లర్లు హెచ్చరించారు. చాలా ఏళ్లుగా సుంకం లేకుండా భారత్ నుంచి చౌకగా నూలును దిగుమతి చేసుకుంటుండడం వల్ల స్థానిక స్పిన్నింగ్ యూనిట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని వారు లేఖలో పేర్కొన్నారు. దీనివల్ల దేశీయ వస్త్ర పరిశ్రమలో 12వేల కోట్ల కంటే ఎక్కువ విలువైన అమ్ముడుపోని నిల్వలు మిగిలిపోయాయని తెలిపారు. 50కి పైగా వస్త్ర పరిశ్రమలు మూసేయడం వల్ల వేలాదిమంది కార్మికులు నిరుద్యోగులుగా మారారన్నారు. మరోవైపు బంగ్లాదేశ్ వస్త్ర పరిశ్రమ వర్గాల డిమాండ్ను అక్కడి వస్త్ర ఎగుమతిదారుల సంఘం వ్యతిరేకిస్తోంది. భారత్ నుంచి దిగుమతి చేసుకున్న నూలుతో పోలిస్తే స్థానికంగా ఉత్పత్తి చేస్తున్న నూలు ఖరీదైనదని వస్త్ర ఎగుమతిదారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ దుస్తుల బ్రాండ్లు, మెరుగైన నాణ్యత విషయాల్లో ప్రపంచ దేశాలు భారత్లో ఉత్పత్తి అయ్యే నూలుకు ప్రాముఖ్యత ఇస్తాయన్నారు. ఇప్పుడు భారత్కు ఉన్న డ్యూటీ-ఫ్రీ సదుపాయాన్ని నిలిపివేస్తే అక్కడి నుంచి ఎగుమతులు తగ్గుతాయన్నారు. దీనివల్ల ప్రపంచ దుస్తుల మార్కెట్లో పోటీని బంగ్లాదేశ్ ఎదుర్కోలేదన్నారు.

# వెనెజువెలాపై అమెరికా ఆపరేషన్

## రహస్య ఆయుధం పేరు వెల్లడించిన ట్రంప్

**వాషింగ్టన్:** వెనెజువెలా ఆపరేషన్లో ఉపయోగించిన రహస్య ఆయుధం పేరు ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడిం చారు. ఆ దేశ సైన్యాన్ని నిర్వీర్యం చేసేం దుకు తమ బలగాలు 'ది డిస్కాం బోబు లేటర్' వాడినట్లు తెలిపారు. అమెరికా దళాలు ఆ ఆయుధాన్ని వాడగానే ప్రత్య ర్థుల వెపన్స్ పని చేయలేదని ట్రంప్ పేర్కొన్నారు. దీని గురించి ఎక్కువగా మాట్లాడేందుకు తనకు అనుమతి లేదని చెప్పారు. "వారి వద్ద రష్యా, చైనా రాకెట్లు ఉన్నాయి. కానీ వాటిని ప్రయో గించలేకపోయారు. మేము రాగానే.. వారు బటన్స్ నొక్కినా అవేవీ పనిచేయలేదు" అని తమ ఆయుధం గురించి వెల్లడించారు. వెనెజువెలాపై మెరుపుదాడి చేసి ఆ దేశ నేత నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా దళాలు నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అగ్రరాజ్యం ఓ రహస్య ఆయుధాన్ని ఉపయోగించినట్లు కథనాలు వచ్చాయి. సీక్రెట్ సోనిక్ వెపన్ను వినియోగించినట్లు కొన్నిరోజుల క్రితం ధ్రువీకరించిన ట్రంప్.. తాజాగా దాని పేరు వెల్లడించారు.

రాజముద్ర www.rajamudranews.com ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక



## ఖైదీ-2పై అనుమానలొద్దన్న లోకేశ్

ఎవరూ ఊహించని విధంగా టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ తో కోలీవుడ్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ సినిమా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో, కార్తితో చేయాల్సిన 'ఖైదీ 2'ను లోకేశ్ ఆపేశారంటూ ఇటీవల రూమర్స్ వచ్చాయి. వాటిపై దర్శకుడు స్పందించారు. చెన్నైలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన క్లారిటీ ఇచ్చారు. అల్లు అర్జున్ సినిమా తర్వాత 'ఖైదీ 2'నే తెరకెక్కిస్తానని వెల్లడించారు. ఖైదీ-2 ఉంటుందని, అనుమానాలు వద్దన్నారు.

# చిత్రపరిశ్రమకు వచ్చే వారిని ప్రోత్సహించాలి

## ఇక్కడ కాస్ట్ కౌచింగ్ అంటూ ఏదీ లేదు

సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి పనిచేస్తానని ఏ ఆడబిడ్డ, మగబిడ్డ అయినా అంటే వారిని ప్రోత్సహించి పంపాలని, తెలుగు సినీ ఇండస్ట్రీ గొప్పదని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. జీవితాంతం ప్రేక్షకులను అలరిస్తూనే ఉంటానని తెలిపారు. ఆయన కీలక పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' భారీ విజయాన్ని అందుకుని రూ.300 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభలో చిరంజీవి మాట్లాడారు. మళ్లీ విజయోత్సవాలను జరుపుకొనే వైభవాన్ని తీసుకొచ్చిన ఘనత దర్శకుడు అనిల్ రావిపూడికి దక్కుతుంది. ఇంతటి ఘన విజయాన్ని అందించిన తెలుగు సినీ ప్రేక్షకులకు ధన్యవాదాలు. సినిమా టీమ్ విజయానందాన్ని అనుభవిస్తుంటే, నాకూ సంతోషంగా ఉంది. అనిల్‌ను చూస్తుంటే రాఘవేంద్రరావుగారు గుర్తుకు వచ్చేవారు. రోజూ సెట్‌లో వినోదాన్ని పంచేవారు. ఈ మూవీ షూటింగ్‌కు వెళ్తుంటే ఎంతో ఆనందంగా ఉండేది. ప్రతి సినిమా కష్టపడి పనిచేస్తాం. కానీ, కొన్ని సినిమా ఫలితాలు ఉత్సాహాన్ని ఇస్తాయి. అలాంటిదే ఈ మూవీ. ఈ సంక్రాంతికి దాదాపు అన్ని సినిమాలను ఆదరించారు. సినిమాలో వెంకీ ఉండాలని కోరుకున్నా. దాన్ని అనిల్ సాకారం చేశాడు. ఎంత పెద్ద స్టార్‌నైనా హ్యాండిల్ చేసే సామర్థ్యం అనిల్ రావిపూడికి ఉంది. మళ్లీ అనిల్‌తో చేసే అవకాశం మా ఇద్దరిలో ఎవరికి వస్తుందో చూడాలి.'అన్నారు.



# తుదిదశకు డ్రాగన్ షూటింగ్

## జూన్ 25న విడుదల చేసేలా ప్లాన్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్-ఇండియన్ సినిమా పై తాజాగా క్రేజీ అప్‌డేట్ బయటికి వచ్చింది. వర్కింగ్ టైటిల్: డ్రాగన్ పేరుతో ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో దూసుకుపోతోంది.తాజాగా ఈ సినిమా ప్రస్తుత షెడ్యూల్ షూటింగ్ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో విజయవంతంగా పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో ఎక్కువగా నైట్ ఎఫెక్ట్‌తో నైట్ షూటింగ్ నిర్వహించారని టాక్. తదుపరి షెడ్యూల్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు సమాచారం. ప్రశాంత్ నీల్ అంటేనే భారీ యాక్షన్, డార్క్ టోన్, పవర్‌ఫుల్ ఎలివేషన్లు గుర్తుకు వస్తాయి. అదే ఫార్ములాను ఈసారి ఎన్టీఆర్ స్థాయికి మించి చూపించేందుకు దర్శకుడు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా ప్యూర్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఇందులో యాక్షన్ సీక్వెన్సులు అత్యంత ఇంటెన్స్‌గా ఉండబోతున్నాయట. ఎన్టీఆర్ కెరీర్‌లోనే బెస్ట్ యాక్షన్ రోల్స్‌లో ఇది ఒకటిగా నిలుస్తుందనే టాక్ వినిపిస్తోంది.ఇప్పటి వరకు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన అన్ని సినిమాల్లోకెల్లా ఇదే బెస్ట్ మూవీ అవుతుందన్న అంచనాలు బలంగా ఉన్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్‌లో టాప్ ప్రొడక్షన్ హౌసెస్‌గా గుర్తింపు పొందిన మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్నాయి. భారీ బ్జడెట్‌తో, పాన్-ఇండియా స్థాయిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. రవి బస్రూర్ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, ఇందులో కథానాయికగా రుక్మిణి వసంత్, కీలక పాత్రలో అనిల్ కపూర్ కనిపించనున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ సినిమా అన్ని భాషల్లో ప్రేక్షకులను ఆకట్టుకునేలా పాన్-ఇండియన్ ప్రాజెక్ట్‌గా రూపొందుతోంది. జూన్ 25 సినిమాని విడుదల చేసే ప్లాన్

# ఇరుముడితో రవితేజ కొత్త మూవీ

మాస్ మహారాజ్ రవితేజ కెరీర్ గత కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో సాగడం లేదు. వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ, ప్రేక్షకుల్లో ఆ సినిమాలు పూర్తి సంతృప్తిని కలిగించలేకపోయాయి. మాస్ ఇమేజ్‌కు కాస్త విరామం ఇచ్చి, క్లాస్ టచ్‌తో చేసిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా సంక్రాంతి బరిలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దీంతో రవితేజ తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ క్రమంలోనే ఆయన దర్శకుడు శివ నిర్వాణతో చేతులు కలిపారు. ఈ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. అయ్యప్ప స్వామి మాలధారణలో రవితేజ కనిపించిన లుక్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంది. పోస్టర్ చూసిన వెంటనే ఒక డివోషనల్ ఫీల్, పాజిటివ్ వైబ్స్ కలుగుతున్నాయన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయ్యప్ప మాలధారణలో ఇరుముడికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఈ సినిమాలో ఎమోషనల్‌గా, డీప్‌గా చూపించబోతున్నారని సమాచారం. సెన్సిటివ్, క్లాస్ కథనాలతో పేరు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈసారి డివోషనల్ టచ్‌తో కథను తెరకెక్కిస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మాస్‌కు భిన్నంగా, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా ద్వారా రవితేజ కొత్త ఇమేజ్‌ను ఆవిష్కరించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి జీ.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. 'ఇరుముడి' రవితేజ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్నది అభిమానుల్లోనూ ఆసక్తి పెరుగుతోంది.



## మరోసారి పోలీసు అధికారిణిగా.. రాణిముఖర్జీ

మహిళల అక్రమ రవాణా.. కిడ్నాప్ లాంటి అంశాలతో రూపొంది మంచి హిట్ బొమ్మ అనిపించుకున్నాయి 'మర్దానీ' చిత్రాలు. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్‌ఫిల్మ్స్ నిర్మించిన ఈ సినిమాలు ఇప్పటికే రెండు భాగాలుగా విడుదలై ప్రేక్షకుల్ని మెప్పించాయి. తాజాగా ఈ ఫ్రాంఛైజీలో 'మర్దానీ 3' రాబోతోంది. రాణి ముఖర్జీ మరోసారి పోలీసు అధికారిణి శివానీ రాయ్ పాత్రలో కనిపించనున్నారు. జనవరి 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



## తరుణ్ భాస్కర్ ఓం శాంతి శాంతి శాంతిః

తనపై పెత్తనం చెలాయించే భర్తకి ఓ భార్య ఎలా బుద్ధి చెప్పింది.. అతడి అహంకారాన్ని ఎలా అణిచింది అనే నేపథ్యంలో సాగే కథ 'ఓం శాంతి శాంతి శాంతిః'. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా జంటగా నటించిన ఈ సినిమాని ఏఆర్ సజీవ్ తెరకెక్కించారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ సంస్థలు నిర్మించాయి. బ్రహ్మాజీ, సురభి ప్రభావతి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. జనవరి 30న థియేటర్లలోకి రానుంది.






## సెలెక్టెడ్ ఐటమ్ సాంగ్స్ చేస్తా : రష్మిక

ఒకప్పుడు సినిమాల్లో ఐటం పాట అంటే ప్రత్యేకంగా ప్రొఫెషనల్ డాన్సర్లే గుర్తొచ్చేవారు. ఆ పాటల్లో వాళ్లు కనిపిస్తేనే హిట్ అనే స్టాండర్డ్ ఉండేది. కానీ కాలం మారింది. ఇప్పుడు అదే సినిమాలో హీరోయిన్‌గా నటించిన నటీమణులే ఐటం సాంగ్స్‌లోనూ స్టెప్పులేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఒకే సినిమాలో హీరోయిన్ పారితోషికంతో పాటు స్పెషల్ సాంగ్ ఫీజు కూడా అందుకుంటూ డబుల్ లాభం పొందుతున్నారు.ఈ ట్రెండ్‌కు అనుగుణంగానే గత కొన్నేళ్లుగా సమంత, కాజల్ అగర్వాల్, తమన్నా, పూజా హెగ్డే, శ్రీలీల వంటి స్టార్ హీరోయిన్లు ఐటం పాటల్లో కనిపించి సెన్సేషన్ క్రియేట్ చేశారు. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ ఇదే ట్రెండ్ బలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా పెద్ద సినిమాల్లో ఐటం సాంగ్ అంటే స్టార్ హీరోయిన్ ఉండాల్సిందే అనే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే 'నేషనల్ క్రష్'గా గుర్తింపు పొందిన రష్మిక మందన్నా కూడా ఈ దారిలోకి అడుగుపెట్టింది. బాలీవుడ్ డెబ్యూ 'గుడ్‌బై'లో నటిగా మెప్పించిన ఆమె, తర్వాత వచ్చిన 'థామా' చిత్రంలో నటనతో పాటు స్పెషల్ సాంగ్‌లోనూ తనదైన స్టైల్‌లో ఆకట్టుకుంది. ఆ పాట తర్వాత రష్మికపై ఐటం భామగా కూడా డిమాండ్ పెరిగింది. దర్శక, నిర్మాతలు 'హీరోయిన్‌గా తీసుకున్నా, ఐటం సాంగ్‌కు కూడా ఒప్పించొచ్చు' అనే ధీమాతో ఆమె వైపు చూస్తున్నారనే టాక్ వినిపించింది. కానీ ఇదే సమయంలో రష్మిక ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాను నటిగా అయినా, ఐటం భామగా అయినా కేవలం ఇద్దరు దర్శకుల సినిమాల్లో మాత్రమే స్పెషల్ సాంగ్స్ చేస్తానని, అంతకుమించి ఈ విషయంలో చాలా సెలెక్టివ్‌గా ఉంటానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.



## మయసభ 30న విడుదల

'తుంబాడ్' వంటి వైవిధ్యమైన కథతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన దర్శకుడు రాహి అనిల్ బార్వే. ఇప్పుడు మరో సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'మయసభ'. జావేద్ జాఫ్రీ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'బంగారం వేటకు మీకు స్వాగతం' అంటూ చిత్ర బృందం విడుదల చేసిన ప్రచార చిత్రం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. వీణా జామ్కర్, దీపక్ దామ్లే తదితరులు నటిస్తున్నారు.

## 'ధురంధర్' నటుడు అరెస్ట్



**ముంబయి:** అత్యాచారం కేసులో 'ధురంధర్' నటుడు నదీమ్ ఖాన్ అరెస్టు అయ్యాడు. పనిమనిషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాల్వానీ పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 41 ఏళ్ల ఓ మహిళ నమీద్ ఖాన్ ఇంట్లో 2015 నుంచి పనిచేస్తున్నారు. పెళ్లి చేసుకుంటానని అతడు నమ్మించాడు. వివాహం గురించి ఎన్నిసార్లు అడిగినా నదీమ్ నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. నదీమ్ పలుమార్లు అత్యాచారం చేసినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మహిళ ఆరోపణలు ధ్రువీకరించామని, ఈ మేరకు అరెస్టు చేశామని ఓ పోలీసు అధికారి మీడియాకు వెల్లడించారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా బాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకున్న నదీమ్ కెరీర్ 'ధురంధర్'తో మలుపు తిరిగింది. రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన ఈ మూవీ బాక్సాఫీసు వద్ద ఘన విజయం అందుకున్న సంగతి తెలిసిందే. దీంతో, అందులో నటించిన వారందరికీ మంచి పేరొచ్చింది. ఈ సినిమాలో.. అక్షయ్ ఖన్నా వంట మనిషిగా నటించారు నదీమ్. ఆయన కీలక పాత్ర పోషించిన 'వధ్ 2' ఫిబ్రవరి 6న విడుదలకు సిద్ధమవుతోంది. 'మిమి', 'వధ్' తదితర చిత్రాల్లో నటించారు.

## సుడిగాలి సుధీర్ గోట్ లిరికల్ వీడియో

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం గోట్ అనేది ఉపశీర్షిక. దివ్యభారతి హీరోయిన్. వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకొంటోన్న ఈ చిత్రం ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి 'రైజ్ ఆఫ్ గణ' అనే లిరికల్ వీడియోను చిత్రం బృందం సోమవారం విడుదల చేసింది. లియోన్ జేమ్స్ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. వినోద్ ఎలుమలై ఆలపించారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com